



# ఆకాంక్ష

T/TG/2024/0523/7229/1544

తెలుగు సంచలన దిన పత్రిక






పబ్లిష్ : తెలంగాణ | బుధవారం 11 -06-2025 | సంపుటి : 01 సంచిక :182 | ఎడిటర్ : పెనుగొండ సతీష్ | పేజీలు : 08 | వెల : 05 రూ /-

published Frome : Hyderabadh, vijayavada, karimnagar, chitur, khammam, warangal, nalgonda, rajamandri, visakapatnam, mahabub nagar, prakasham,nijambad, rajana sirisilla




## ఢిల్లీలోనే మకాం వేసిన

# సీఎం రేవంత్

### పిలుపు రావడంతో హుటాహుటిన ఢిల్లీకి మంత్రి ఉత్తమ్



### మంత్రులకు శాఖల కేటాయింపులపై కసరత్తు

### కొందరు మంత్రుల శాఖల మార్పుపైనా చర్చ

### కెసి వేణుగోపాల్, ఖర్గేలతో సిఎం మంతనాలు

హైదరాబాద్,జూన్10(ఆకాంక్ష న్యూస్) :

తెలంగాణ మంత్రుల శాఖల్లో భారీ మార్పులకు అవకాశం ఉన్నట్లు సమాచారం. కొత్త మంత్రులకు శాఖల కేటాయింపుతో పాటు శాఖల మార్పులపైన కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే రెండురోజులుగా ఢిల్లీలో మకాం వేసిన సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అగ్రనేతల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఢిల్లీ నుంచి పిలుపు వచ్చింది. దీంతో ఆయన హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఇకపోతే సోమవారం కాంగ్రెస్ కార్యదర్శి కేసీ వేణుగోపాలతో గంటకుపైగా రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సీఎం రేవంత్ రెడ్డి బేటి అయ్యారు. ఖర్గేతో భేటీ తరువాత మంత్రుల శాఖల మార్పులు ఖరారు కానున్నాయి సమాచరం. అలాగే కొత్త మంత్రులకు కూడా శాఖల కేటాయింపు జరుగుతుంది. ఈ క్రమంలో ప్రస్తుతం వివిధ శాఖలను నిర్వహిస్తున్న మంత్రుల శాఖల్లో కూడా మార్పులు చోటుచేసుకుంటాయని ప్రచారం నడుస్తోంది. మంత్రి పదవులే కాదు.. శాఖల కేటాయింపుల్లోనూ సామాజిక

మిగతాది 2 లో...

## బస్ పాస్ ధరల పెంపుపై నిరసన

### బస్ భవన్ ముట్టడికి కవిత యత్నం

### రోడ్డుపై బైఠాయించడంతో అరెస్ట్

### బస్ భవన్ ఎదుట బిఆర్ఎస్వి మెరుపు ధర్నా



హైదరాబాద్,జూన్10(ఆకాంక్ష న్యూస్) :

తెలంగాణ జాగృతి నేత, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టయ్యారు. పెంచిన బస్ పాస్ ధరలను వెంటనే తగ్గించాలంటూ తెలంగాణ జాగృతి కార్యకర్తలతో కలిసి మంగళవారం బస్ భవన్‌ను ముట్టడించేందుకు కవిత ప్రయత్నించారు. ఆ క్రమంలో ఆమె ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆమె రోడ్డుపై బైఠాయించడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. ఈ మేరకు కవిత, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. కవిత ధర్నాతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. దీంతో కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఆమెను చంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తెలంగాణ ప్రజలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అడ్డగోలుగా దోచుకుంటోందని.. విద్యార్థులు, ప్రజలపై తీవ్ర భారం పడుతోందని ఈ సందర్భంగా కవిత ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రాయణ గుట్ట పోలీస్ స్టేషన్‌కు కవితను తరలించడంతో జాగృతి కార్యకర్తలు సైతం భారీగా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పోలీసులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అన్ని రకాల బస్ పాస్ ఛార్జీలను టీజీఎస్ఆర్టీసీ పెంచింది. ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌తోపాటు– మెట్రో డీలక్స్ ఛార్జీలనూ పెంచేసింది. మరోవైపు పెంచిన బస్ పాస్ చార్జీలను తగ్గించాలని

మిగతాది 2 లో...

## ఆషాఢ బోనాలకు 20 కోట్లు విడుదల

### శాఖల మధ్య సమన్వయంతో ముందుకు సాగాలి

### హైదరాబాద్‌కు పేరు తెచ్చేలి బోనాల నిర్వహణ

### అధికారులతో మంత్రులు పొన్నం, కొండా సురేఖల సమీక్ష



హైదరాబాద్,జూన్10(ఆకాంక్ష న్యూస్) :

నగరంలో ప్రసిద్ధి చెందిన ఆషాఢ పండుగ బోనాల ఉత్సవాలు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో బోనాల ఉత్సవాలపై మంగళవారం అన్ని విభాగాల అధికారులతో మంత్రులు కొండా సురేఖ,

మిగతాది 2 లో...

## సజావుగా మొహర్రం ఊరేగింపు

### మొహర్రం ఏర్పాట్లపై సమీక్షలో మంత్రి పొన్నం



హైదరాబాద్,జూన్10(ఆకాంక్ష న్యూస్) :

జూలై మొదటి వారంలో జరగనున్న మొహర్రం ఉరేగింపు కార్యక్రమాలకు ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు– చేస్తుందని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు . మొహర్రం ఏర్పాట్లపై మంగళవారం డా.బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ తో కలిసి వివిధ శాఖల అధికారులు, షియా మత పెద్దలతో మంత్రి పొన్నం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మొహర్రం కార్యక్రమాలు నిర్వహించే ఆశుర్ ఖానాల వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు– చేయాలన్నారు. ఆశుర్ ఖానాల

మిగతాది 2 లో...

## ఏజెన్సీ ప్రాంతాల్లోని స్థానికులకే ఉద్యోగాలు

### ఉట్నూరు, ఏటూరునాగారం ఐటిడిఎల అభివృద్ధికి రూ. 12 కోట్లు

### గ్రామసభల అనుమతితోనే అటవీ అధికారుల చర్యలు ఉండాలి

### ఏజెన్సీ ప్రాంత ఎమ్మెల్యేలతో సమీక్షలో మంత్రి సీతక్క

హైదరాబాద్,జూన్10(ఆకాంక్ష న్యూస్) :

ఏజెన్సీ ప్రాంతాల్లోని ఉద్యోగాలు స్థానికులకే దక్కేలాగా జిఓ నెం.3ను పునరుద్ధరించాలన్న పక్రియను ప్రభుత్వం ప్రారంభించిందని మంత్రి సీతక్క తెలిపారు. వెనకబడ్డ ఉట్నూరు, ఏటూరునాగారం ఐటిడిఎల అభివృద్ధికి రూ. 12 కోట్లు– ప్రత్యేకంగా కేటాయించినట్లు వెల్లడించారు. మంగళవారం మంత్రి సీతక్క అధ్యక్షతన మాసబ్ ట్యాంక్ లోని సంక్షేమ భవన్ లో

మిగతాది 2 లో...



## నేడు కాళేశ్వరం కమిషన్ ముందుకు కెసిఆర్

### మరోమారు కెసిఆర్‌తో హరీష్ సుదీర్ఘ మంతనాలు

### చర్చనీయంశాలపై ఇరువురు నేతల మల్లగుల్లాలు

### భారీ కాన్వాయ్‌తో కెసిఆర్ హాజరయ్యేలా ప్లాన్

గజ్వెల్,జూన్10(ఆకాంక్ష న్యూస్) :

కాళేశ్వరం కమిషన్ విచారణకు బుధవారం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ హాజరు కానున్నారు. ఈ సందర్భంగా భారీగా జనసమీకరణతో రావాలని పార్టీలో చర్చించారు. కెసిఆర్ వెంట భారీ కాన్వాయ్‌తో వచ్చి హల్‌చల్ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇదిలావుంటే మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి కెసిఆర్‌తో భేటీఅయ్యారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్, హరీశ్ రావు మధ్య కాళేశ్వరం కమిషన్ విచారణ

మిగతాది 2 లో...



## అంతర్జాతీయ సినీ సిటీగా హైదరాబాద్ అభివృద్ధి

### ఈ మేరకు తోణమే డిపిర్ సిద్దం చేయాలి

### మంత్రివర్గ ఉపసంఘం ఆదేశాలు

హైదరాబాద్,జూన్10(ఆకాంక్ష న్యూస్) :

హైదరాబాద్‌ను అంతర్జాతీయ సినీ సిటీగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులను మంత్రివర్గ ఉపసంఘం ఆదేశించింది. నగరంలో మరింతగా సినీరంగం అభివృద్ధి చెందాలని ఆశించారు. ఇందుకు తగుచర్యలు అవసరమని అభిప్రాయపడింది. సినీరంగంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, డి.శ్రీధర్ బాబుతో కూడిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది.

మిగతాది 2 లో...



## నేడు కాళేశ్వరం కమిషన్ ముందుకు కెసిఆర్



అంశంపై సుదీర్ఘ చర్చ జరిగింది. కాళేశ్వరం కమిషన్ ఎదుట కేసీఆర్ హాజరుకానున్న నేపథ్యంలో ఇద్దరు నేతలు విచారణ అంశంపై చర్చించారు. బలప్రదర్శన ఏర్పాట్లపై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కాళేశ్వరం కమిషన్‌కి ఇచ్చేందుకు ఇప్పటికే కేసీఆర్ నివేదిక సిద్ధం చేశారు. అయితే హరీష్ రావును కాళేశ్వరం కమిషన్ అడిగిన ప్రశ్నల ఆధారంగా మరో నివేదిక కూడా సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది. హరీష్ రావుతో పాటు- ఫామ్‌హౌస్‌లో మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కూడా ఉన్నారు. సోమవారం కాళేశ్వరం కమిషన్ విచారణకు సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు హాజరయ్యారు. విచారణ అనంతరం నేరుగా ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లిన హరీశ్ రావు.. కేసీఆర్‌తో భేటీ అయ్యారు. కాళేశ్వరం కమిషన్ అడిగిన ప్రశ్నలు, విచారణ తీరుపై కేసీఆర్‌కు వివరించారు. వీరి భేటీ సుమారు 5 గంటల పాటు సాగింది. మంగళవారం మరోసారి హరీశ్ రావు ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లి కేసీఆర్‌తో భేటీ- అయ్యారు. కాళేశ్వరం కమిషన్ విచారణకు బుధవారం కేసీఆర్ హాజరుకావాల్సి ఉండడంతో వీరి భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. విచారణ సందర్భంగా కమిషన్‌కు అందించాల్సిన డాక్యుమెంట్స్ ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కూడా ఇచ్చే యోచనలో కేసీఆర్ ఉన్నట్లు- సమాచారం. కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరయ్యేందుకు కేసీఆర్ వెళ్లే సమయంలో ఆయనకు మద్దతుగా భారీ సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇప్పటికే ప్రణాళికలు రూపొందించినట్లు- సమాచారం. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డితో పాటు- చుట్టుపక్కల జిల్లాల నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివస్తారని తెలుస్తోంది. మేడిగడ్డ బ్యారేజీ పియర్స్ కుంగడం.. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో బుంగలు బయటపడిన నేపథ్యంలో గతేడాది రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో విచారణ కమిషన్‌ను నియమించింది. ఇప్పటికే ఈటెల, హరీష్‌లతో విచారణ ముగిసింది.

# ఢిల్లీలోనే మకాం వేసిన సీఎం రేవంత్

న్యాయంకు ప్రాధాన్యత నివ్వాలని కాంగ్రెస్ అధిష్టానం పేర్కొంది. కొందరు మంత్రుల పనితీరు సరిగా లేదంటూ ఇప్పటికే కొందరు పార్టీ నేతలు అధిష్టానానికి నివేదించారు. అలాగే మంత్రుల పనితీరుపై ఇప్పటికే పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ అధిష్టానానికి నివేదిక ఇచ్చారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, వివిధ స్థాయి నేతలతో భేటీలో అందిన సమాచారం ఆధారంగా ఆమె నివేదికలు రూపొందించారు. కీలక శాఖల బాధ్యతలు అన్ని కొందరు మంత్రులే నిర్వహిస్తుండటంతో పని భారం కారణంగా కొన్ని శాఖల్లో ఆశించిన ఫలితాలు రావట్లేదనే అంచనలో కాంగ్రెస్ ముఖ్య నేతలు ఉన్నారు. మంత్రుల పనితీరు వ్యవహార శైలిపై కేసి వేణుగోపాల్ గతంలోనే ఢిల్లీలో సమావేశం నిర్వహించి సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రభుత్వ పాలనా వ్యవహారాలు, మంత్రుల వ్యవహార శైలి, పనితీరుపై తన అంచనాలను అధిష్టాన ముఖ్యులతో సీఎం రేవంత్ రెడ్డి పంచుకున్నారు. విద్య, మున్సిపల్ పట్టణాభివృద్ధి, హోం, న్యాయం సహా పదికి పైగా కీలక శాఖలు ముఖ్యమంత్రి వద్దే ఉన్నాయి. ప్రస్తుతం ముఖ్యమంత్రి వద్ద ఉన్న మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖను విడగొట్టి మున్సిపల్ శాఖను మరొకరికి ఇచ్చే అవకాశం ఉంది. కాగా తనకు విద్యుత్తు లేదా విద్యాశాఖ ఇవ్వాలని వివేక్ కోరుతున్నారు. ప్రస్తుతం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వద్ద విద్యుత్ శాఖ ఉంది. త్వరలో కొన్ని కార్పొరేషన్ చైర్మన్ పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాగా తెలంగాణలో కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులకు శాఖల కేటాయింపుపై హస్తినలో కసరత్తు మొదలైంది. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయి దాదాపు గంటసేపు చర్చించారు. మంత్రులకు శాఖల కేటాయింపుపైనే ప్రధానంగా వీరి చర్చ సాగినట్టు- తెలిసింది. ప్రస్తుతం మంత్రివర్గంలో ఎవరెవరి దగ్గర ఏయే శాఖలున్నాయి? రెండు, మూడు మంత్రిత్వ శాఖలు నిర్వహిస్తున్న వారెవరు? కొత్తగా మంత్రివర్గంలో చేరిన వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్‌కు ఏ శాఖలు కేటాయించాలి? అనే అంశాలపై సుధీర్ఘంగా చర్చించినట్టు సమాచారం. దీనికి సంబంధించిన జాబితాను కేసీ వేణుగోపాల్‌కు సీఎం రేవంత్ అందించినట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం ఎవరికీ కేటాయించని శాఖలను కొత్తవారికి కేటాయించే అంశంపై సమాలోచన జరిగినట్టు- తెలుస్తోంది. అయితే, ప్రస్తుతం ఎవరికీ కేటాయించని శాఖలన్నీ ముఖ్యమంత్రి వద్దే ఉన్నాయి. అందులో ప్రధానమైనవి.. విద్య, పురపాలకం, హోం, గనులు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ- సంక్షేమం, వాణిజ్య పన్నులు, పశు సంవర్ధక శాఖ, న్యాయ, కార్మిక, క్రీడలు యువజన శాఖ. వీటిలో విద్యా శాఖను తనకు కేటాయించాలని గడ్డం వివేక్ కోరుతున్నట్టు- తెలిసింది. ఇదే విషయాన్ని మల్లికార్జున ఖర్గేకు సైతం తెలియజేసినట్టు- సమాచారం. అయితే, వివేక్‌కు కార్మిక, మైనింగ్, క్రీడల శాఖ.. అడ్లూరి లక్ష్మణ్‌కు ఎస్సీ, ఎస్టీ సంక్షేమం, వాకిటి శ్రీహరికి పశుసంవర్ధక, యువజన, న్యాయ లేదా మత్స్య శాఖ కేటాయించే అవకాశం ఉన్నట్టు- జోరుగా ప్రచారం జరుగుతోంది. దీంతోపాటు-.. మంత్రివర్గంలో స్థానం దక్కుతుందని ఆశించి నిరాశ చెందిన వారి ప్రభావమెంత వారిని శాంతింపజేయడం ఎలా అనే అంశాలపై కూడా కేసీ, రేవంత్ రెడ్డి మధ్య చర్చ జరిగినట్టు సమాచారం. మంత్రివర్గంలో మరో ముగ్గురికి అవకాశం ఉన్న నేపథ్యంలో మిగిలిన వారికి ఈసారి చోటు- కల్పిస్తామనే నమ్మకం కలిగించాలని రేవంత్ రెడ్డికి కేసీ సూచించినట్టు తెలిసింది. అలాగే.. ప్రస్తుతం కీలక మంత్రిత్వ శాఖలు నిర్వహిస్తున్న వారి వ్యవహారశైలి, పనితీరు తదితర అంశాలను ఆయన అడిగి తెలుసుకున్నట్టు- సమాచారం. ఈ నేపథ్యంలో ఒకరిద్దరి మంత్రుల శాఖల్లో మార్పులు చేసే అవకాశం ఉన్నట్టు- కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే ఉత్తమ్‌కు పిలుపు రావడంతో అనుమానలు బలపడుతున్నాయి. ఉత్తమ్ నీటిపారుదలతో పాటు పౌరసరఫరాల శాఖ నిర్వహిస్తున్నారు. దీంతో ఆయన శాఖల్లో మార్పులు జరగవచ్చని అంటున్నారు.

## అంతర్జాతీయ సినీ సిటీగా హైదరాబాద్ అభివృద్ధి

జాతీయ, అంతర్జాతీయ సినీ పరిశ్రమలను ఆకర్షించేలా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలని కేబినెట్ సబ్ కమిటీ- పేర్కొంది. సినిమా షూటింగ్‌లకు పోలీసు, ఫైర్, మున్సిపాలిటీ- తదితర శాఖల అనుమతులన్నీ సింగిల్ విండో పద్ధతిలో అందేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రులు ఆదేశించారు. అనుమతులు పొందేందుకు ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో ఒక అధికారిని ప్రత్యేకంగా నియమించాలని భట్టి విక్రమార్క సూచించారు. థియేటర్లలో తినుబండారాల ధరలను నియంత్రించాలని అధికారులకు ఉపముఖ్యమంత్రి, మంత్రులు స్పష్టం చేశారు. అధిక ధరలకు విక్రయించడం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు గతంలో ప్రభుత్వం కేటాయించిన 50 ఎకరాల్లో ప్రస్తుతం నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయో తెలపాలని కేబినెట్ సబ్ కమిటీ- ఆదేశించింది. సినీ కార్మికుల కోసం నిర్మించిన చిత్రపురి కాలనీపై ఏర్పాటు చేసిన కమిటీని తదుపరి సమావేశానికి పిలిపించాలని తెలిపారు. ఈనెల 14న గద్దర్ ఫిలిం అవార్డుల వేడుకను అత్యంత ఘనంగా నిర్వహించాలని డిప్యూటీ- సీఎం దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు, కమిషనర్ హరీష్, డైరెక్టర్ కిశోర్ బాబు, హోం శాఖ ప్రత్యేక సీఎస్ రవి గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# బస్ పాస్ ధరల పెంపుపై నిరసన

డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులు బస్ భవన్ ఎదుట మెరుపు ధర్నా చేపట్టారు. ధర్నాకు దిగిన అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షుడు పడాల సతీష్, కడారి స్వామి యాదవ్‌తో పాటు- బీఆర్ఎస్వీ శ్రేణులను, విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా గెల్లు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సు పాస్ ఛార్జీలు పెంచడం వల్ల పేద విద్యార్థులపై ఆర్థిక భారం పడుతుంది. ఒక్కో విద్యార్థిపై రూ. 250 నుంచి రూ. 350 వరకు భారం పడుతోంది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విద్యార్థులపై ఈ విధమైన భారం ఏదీ విధించలేదు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి, ఒకవైపు బస్సులను పెంచక విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ.. మరోవైపు చార్జీలు పెంచి విద్యార్థులపై రేవంత్ సర్కార్ ఆర్థిక భారాన్ని మోపుతుందని గెల్లు శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. పెంచిన బస్సు చార్జీలను వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. దాదాపు 20 శాతం మేర ఛార్జీలను పెంచడంతో హైదరాబాద్ నగర వాసులపై అధిక భారం పడనుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అయితే ఈ బస్ పాస్ ఛార్జీల పెంపుపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికే స్పందించారు. బస్ పాస్ ఛార్జీలు పెంచి చాలా కాలమైందని.. ఈ నేపథ్యంలో వాటిని పెంచాల్సి వచ్చిందంటూ వివరణ ఇచ్చారు. బస్ ఛార్జీల పెంపు నేపథ్యంలో ప్రజలపై ఆర్థిక భారం పడుతుందంటూ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని బస్ భవన్‌ను ముట్టడించేందుకు యత్నించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టయ్యారు

## సజావుగా మొహర్రం ఊరేగింపు

పరిసర ప్రాంతాలలో పెండింగ్ లో ఉన్న డ్రైనేజ్, రోడ్ల మరమ్మత్తు పనులను వెంటనే పూర్తి చేయాలని, అన్ని చోట్ల హైమాస్ట్ లైట్లను ఏర్పాట్లు- చేయాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. అటవీ శాఖ అధికారులు మొహర్రం రోజు ఏనుగు ఊరేగింపు ఏర్పాట్లు- చేయాలని అధికారులను సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక విద్యుత్ దీపాలను ఏర్పాటు- చేయాలని, వాటర్ బోర్డ్ అధికారులు త్రాగు నీరు అందించాలని, జిహెచ్.ఎంసి అధికారులు పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని అన్నారు. మొబైల్ టాయిలెట్స్ తదితర మౌళిక సదుపాయాలు ఏర్పాటు- చేయాలని సూచించారు. ఆర్ అండ్ బి అధికారులు బారికేడింగ్ ఏర్పాటు- చేయాలని ఆదేశించారు. మొహర్రం ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రధాన ఊరేగింపు ప్రారంభం కానున్న బీబీకా-ఆలం పరిసరాల ప్రాంతంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు- చేయాలన్నారు. ఆశుర్ ఖానాలకు వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌళిక వసతులు కల్పించాలని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ సూచించారు. వైద్య శిబిరాలు, అంబులెన్స్ లను కూడా అందుబాటు-లో ఉంచాలని అన్నారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, చార్మినార్, బహదూర్‌పురా, యాకత్ పురా, నాంపల్లి, కార్వాన్ ఎంఎల్ఎలు మీర్ జుల్ఫెకర్ అలీ, మహమ్మద్ ముబీన్, జాఫర్ హుస్సేన్, మాజిద్ హుస్సేన్, కౌసర్ మొహియుద్దీన్, ఎంఎల్‌సీలు మీర్జా రియాజ్ ఉల్ హసన్, అమీర్ అలీ ఖాన్, బల్మూరి వెంకట్, వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, మైనారిటీ- ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబైదుల్లా కొత్వాల్, జిహెచ్‌ఎంసి కమీషనర్ ఆర్‌వి కర్ణన్, హైదరాబాద్ పోలీస్ కమీషనర్ సివి ఆనంద్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్ ఎండి అశోక్ రెడ్డి, మైనారిటీ- సంక్షేమ శాఖ కార్యదర్శి, వక్ఫ్ బోర్డు సిఈఓ తదితరులు పాల్గొన్నారు.

# ఆషాఢ బోనాలకు 20 కోట్లు విడుదల

పొన్నం ప్రభాకర్లుఉ సమీక్షించారు. బోనాల పండుగ కోసం ప్రభుత్వం రూ. 20 కోట్లు కేటాయించిందని మంత్రి తెలిపారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా గత ఏడాది బోనాల పండుగ జరుపుకున్నామని, ఒకటి రెండు చోట్ల ఇబ్బందులు తలెత్తాయని.. ఈ సారి ఎలాంటి సమస్యలు లేకుండా నిర్వహించాలని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు. వీఐపీ మూమెంట్‌లో తొక్కిసలాటలు జరుగుతున్నాయని, అవి జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు- చెప్పారు. జోగినీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని.. గతంలో జరిగిన దానికంటే ఇంకా మంచిగా బోనాల ఉత్సవాలు జరపాలని అనుకుంటున్నామని మంత్రి కొండా సురేఖ చెప్పారు. సరస్వతి పుష్కరాలు కూడా అద్భుతంగా నిర్వహించామని.. పక్క రాష్ట్రాల భక్తులు కూడా ఎంతో అభినందించారని అన్నారు. అధికారులు సమన్వయంతో ఉండి డ్యూటీ చేయాలని.. సంయమనం పాటించాలని కోరుతున్నామన్నారు. భక్తులతో దురుసుగా ప్రవర్తించకుండా మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ దర్శనం చేయించాలన్నారు. గత ఏడాది బోనాల సమయంలో పొన్నం ప్రభాకర్ వీడియో వైరల్ అయిందని.. ఈసారి ఎలాంటి తప్పిదాలు జరగకుండా ఎవరి డ్యూటీ వారు సక్రమంగా చేయాలని మంత్రి కొండా సురేఖ అధికారులకు సూచించారు. గోల్కొండ జగదాంబిక అమ్మవారి తొలి బోనంతో బోనాల ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. గోల్కొండ జాతర, బల్కంపేట ఎల్లమ్మ తల్లి వార్షిక కల్యాణోత్సవం, లష్కర్, లాల్ దర్వాజ బోనాలు, అమ్మవారి అంబారి ఊరేగింపు, రంగం కార్యక్రమాలు అన్ని సక్రమంగా జరిగేలా యాక్షన్ ప్లాన్ రెడీ చేస్తున్నామని మంత్రి చెప్పారు. ఈసారి బోనాలకు ప్రభుత్వం రూ. 20 కోట్లు- విడుదల చేసిందన్నారు. నూతన దేవాలయాలు యాడ్ అయ్యాయి కాబట్టి ఇంకో 10 శాతం ఫండ్స్ రిలీజ్ చేయాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎండోన్మెంట్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ చెక్కులు డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలన్నారు. డ్యూటీ లా కాకుండా ప్రతి ఒక్కరు అమ్మవారి ఆజ్ఞతో సేవ చేస్తున్నామని అనుకోవాలన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమం జరగాలని కోరుకుంటు-న్నట్లు- మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ఈ ఏడాది తొలి బోనం జూన్ 26న చారిత్రాత్మక గోల్కొండ కోటలో ప్రారంభం కానుందని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. తర్వాత వరుసగా బల్కంపేట ఎల్లమ్మ, ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ బోనాలు జరగనున్నాయి. బోనాల పండుగను రాష్ట్ర గౌరవానికి మారు పేరుగా మార్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే రూ. 20 కోట్లు- కేటాయించింది. పండుగకు ముందు దేవాలయాల అభివృద్ధికి ఇవ్వబోయే చెక్కులను రెవెన్యూ మరియు ఎండోమెంట్స్ శాఖలు సమన్వయం చేసుకొని పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రత్యేకంగా హైదరాబాద్ నగరానికి గుర్తింపు తీసుకొచ్చే బోనాల ఉత్సవాలపై ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. బోనాల పండుగను ఏ అడ్డంకులు లేకుండా నిర్వహించేం దుకు జీహెచ్‌ఎంసీ, శానిటేషన్, రెవెన్యూ, లైటింగ్, వాటర్ ఫెసిలిటీ-, కంట్రోల్ రూమ్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. పోలీసు శాఖ లా అండ్ ఆర్డర్ పరంగా అప్రమత్తంగా ఉండాలి. అన్ని శాఖలతో సమన్వయం పెంచి పండుగ వేళ ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. అధికారులు తమ బాధ్యతను కేవలం ఉద్యోగంగా కాకుండా, భక్తి భావంతో సేవగా భావించి ప్రతి చర్యను శ్రద్ధగా చేయాలని మంత్రి సూచించారు. ప్రత్యేకించి ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ, బల్కంపేట ఎల్లమ్మ ఉత్సవాలపై 'ప్లాన్ ఆఫ్ యాక్షన్' సిద్ధం చేయాలని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో బోనాల పండుగ విజయవంతంగా జరిగితే, ఇది హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయ స్థాయిలో గౌరవాన్ని తీసుకొస్తుంది అని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. అందరూ బాధ్యతగా తమ పనిని నిర్వహించి, నృత్యాలు, ఊరేగింపులు, సంప్రదాయ వేడుకలతో బోనాలను ఘనంగా జరపాలని పిలుపునిచ్చారు.

# ఏజెన్సీ ప్రాంతాల్లోని స్థానికులకే ఉద్యోగాలు

గిరిజన, ఆదివాసి ఎంఎల్‌ఎల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డిప్యూటీ కానున్న డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్, ఎంఎల్‌ఎలు పాయం వెంకటేశ్వర్లు, వెడ్మ బొజ్జు పటేల్, కోవ లక్ష్మి, అనిల్ జాదవ్, ఆదినారాయణ, -ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్య నాయక్, జిసిసి ఛైర్మన్ కోట్నాక్ తిరుపతి, -ట్రైబల్ సెక్రటరీ శరత్, ఎస్‌టి గురుకుల సంస్థ కార్యదర్శి సీతాలక్ష్మీ, అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి, జిసిసి, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు. రూ. 1,000 కోట్లతో రాజీవ్ యువ వికాశం, రూ. 12,600 కోట్లతో ఇందిర సౌరజల గిరి వికాసం, రూ.17,168 కోట్లతో ఎస్‌టి ఎస్‌డిఎఫ్ నిధులతో గిరిజనుల విద్య, ఆరోగ్యం, వసతి, ఉపాధి, మౌలిక వసతుల కల్పన వంటి ప్రజా ప్రయోజన పథకాలు అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్కకు సమావేశం ధన్యవాదాలు తెలిపింది. ఏజెన్సీ పాంత్రాల్లో అటవీ శాఖ అధికారుల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులను ఎంఎల్‌ఎలు మంత్రి దృష్టికి తెచ్చారు. గ్రామ సభల అనుమతులు లేకుండా, పెసా చట్టాలను ఉల్లంఘిస్తు అటవీ అధికారులు ఏక పక్షంగా వ్యవహరిస్తున్నారని అసంతృప్తిని వ్యక్తం చేశారు. తడోబా టైగర్ రిజర్వ్, కవ్వాల్ -టైగర్ రిజర్వు మధ్యలో ఉన్న ప్రాంతాన్ని కొమురం భీం కన్జర్వేషన్ రిజర్వుగా ప్రకటిస్తూ తెచ్చిన జిఓ నెం.49ను ఉపసంహరించుకోవాలని ఎంఎల్‌ఎలు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో గ్రామసభ అనుమతి లేకుండానే గ్రామంలో ప్రవేశించి ఫారెస్ట్ ఏరియా పేరుతొ భూములను స్వాదీనం చేసుకోవడాన్ని వారు తప్పుపట్టారు. గ్రామసభ అనుమతి లేకుండా గిరిజన గ్రామల్లో, పొలాల్లో అటవీశాఖ అధికారులు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వన్ని విజ్ఞప్తి చేస్తూ సమావేశం తీర్మానించింది. రాజీవ్ యువ వికాసం, ఇందిర సిరి జల వికాసం, అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల పై ప్రదానం గా చర్చ జరిగింది. డిప్యూటీ స్పీకర్ రామచంద్రనాయక్ ను ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. ఈ సమావేశంలో మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ ఐటిడిఎల ద్వారా ఇందిరమ్మ ఇండ్లు సాధించుకున్నామన్నారు. ఎస్‌టిలకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రత్యేక కోటా కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇందిరా సౌర జల గిరి వికాసం ద్వారా గిరిజన రైతుల భూముల్లో సిరులు పండించబోతున్నామన్నారు. గిరిజన సంక్షేమ శాఖను ముఖ్యమంత్రి బలోపేతం చేసే దిశలో అడుగులు వేస్తున్నారన్నారని, రూ. 17,168 కోట్లు- కేటాయించారని తెలిపారు. పెసా నిబంధనలకు విరుద్దంగా అటవీ శాఖ తెచ్చిన జిఓ 49 ని ఉపసంహరించుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎంఎల్‌ఎలు కోరుతున్నారన్నారు. వారి అభిప్రాయాలను ముఖ్యమంత్రి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క హామినిచ్చారు. గిరిజన సంక్షేమ శాఖలో పెండింగ్ బిల్లులు ఉన్నాయని, వాటిని సిఎం, డిప్యూటీ- సిఎం దృష్టికి తీసుకెళ్లి విడుదల చేయిస్తామని తెలిపారు. మన సంస్కృతితోనే మన అస్థిత్వం కపాడబడుతుందని, అందుకే మన సంస్కృతిని, కళలను కపాడుకునేలా చర్యలు తీసుకుంమని చెప్పారు. గిరిజన విద్యా సంస్థల్లో జాతి గొప్పతనాన్ని చాటేలా మన అటలు, పాటల ద్వారా మన సంస్కృతిని చాటి చెప్పేల చర్యలు తీసుకుందామన్నారు. జననం నుంచి మరణం వరకు ఆదివాసుల జీవితాలను అక్షర బద్ధం చేసి భవిష్యత్తు తరాలకు అందిద్దామన్నారు. భద్రాచలం లో ఏర్పాటు- చేసిన -ట్రైబల్ మ్యూజియం తరహాలోనే ఇతర ఐటిడిఎల్లో మ్యూజియంలను, లైబ్రరీలను ఏర్పాటు- చేయాలన్నారు. ఏజెన్సీ ఏరియాలో ప్రత్యేక జాబ్ మేళాలను ఏర్పాటు- చేసి యువతకు ఉపాధి మార్గాలు కల్పిస్తామన్నారు. త్వరలో మహబూబాబాద్, ఆసిఫాబాద్లలో జాబ్ మేళాలు ఏర్పాచు చేస్తామని, గిరిజన సంక్షేమ శాఖలో అంతర్ భాగంగా ఉన్న సంస్కృతిక విభాగాన్ని బలోపేతం చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్నారు. గతంలో ఐటిడిఎ పరిధిలో ఉన్న 26 శాఖలను తిరిగి ఐటిడిఎ గోడుగు కిందికి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. అంబేద్కర్ ఓవర్సిస్ స్కాలర్ షిప్‌లో గిరిజన విద్య సంస్థల్లో చదువుకున్న విద్యార్థులకు 40 నుంచి 50 శాతం రిజర్వేషన్ అమలు చేసేలా నిర్ణయం తీసుకుంటామన్నారు. గిరిజన ఎంఎల్‌ఎల సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ముఖ్యంత్రి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిర్ణయాలను అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని సీతక్క హామినిచ్చారు. అంతకు ముందు మంత్రి సీతక్క సంక్షేమ భవన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ట్రైబల్ కెఫటేరియాను ప్రారంభించి, -ట్రైబల్ దేవాలయాలను దర్శించు కున్నారు. గిరిజనులు, అటవీ ప్రాంత వాసులకే పరిమితమైన చిరు, తృణ ధాన్యాలు, కల్తీకి తావులేని సహజ సిద్ధమైన ఆటవీ ఉత్పత్తులతో తయారుచేసిన చిరుతిళ్లు, వంటకాలను రాష్ట్ర ప్రజలందరికి రుచి చూపేందుకు కెఫ్ ఏర్పాటు- చేసిందన్నారు. అటవీ ఉత్పత్తు లతో తయారుచేసిన చిరుతిళ్లు, ఇతర వంటకాలను ప్రజలందరికీ పరిచయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, హైదరాబాద్ లోని మాసాబ్ ట్యాంక్ వద్ద గల తెలుగు సంక్షేమ భవన్‌లో గిరిజన మ్యూజియం ముందు గిరిజన ఆహారశాల పేరుతో స్టాల్ ఏర్పాటు- చేశారు. 20 రకాల -ట్రైబల్ వంటకాలు ను అందుబాటు- లో ఉంచారు. మంత్రి సీతక్క గిరిజన వంటలను రుచి చూశారు. గిరిజన ఆడిటోరియంలో ప్రదర్శించిన ఆదివాసుల ఆరాధ్య దైవం కొమురం భీం పోరాటం, అమరత్వం ఇతివృతంగా రూపొందించిన కొమరం భీమ్ డాక్యుమెంటరీ చిత్ర ప్రదర్శనను గిరిజన ఆదివాసి ఎంఎల్‌ఎ లతో కలిసి సీతక్క వీక్షించారు.



# సర్వసభ్య సమావేశం ప్రతిపాదనలపై కమిషనర్ శాఖాధిపతులతో సమీక్ష




**విజయవాడ, (ఆకాంక్ష న్యూస్) :** సర్వసభ్య సమావేశం ప్రతిపాదనలపై శాఖాధిపతులతో సమీక్ష నిర్వహించారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర. మంగళవారం ఉదయం ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ లో రానున్న సాధారణ సర్వ సభ్య సమావేశం లోగల అజెండా విషయాలపై శాఖాధిపతులతో చర్చించారు. విజయవాడ నగరాభివృద్ధికి ప్రజా ప్రతినిధులు పొందుపరిచిన సాధారణ సర్వసభ్య సమావేశపు అజెండాలో అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి వాటిపై ప్రస్తుతమున్న స్థితిగతులు, తీసుకోవాల్సిన చర్యలు పూర్తిస్థాయిలో తెలుసుకోవాలని అన్నారు. జోన్ వారీ అభివృద్ధి పనులు, ప్రజలకు అందించాల్సిన మౌలిక సదుపాయాలు అందించే కౌన్సిల్ ఎజెండా ప్రతిపాదనలు సహకరించాలని అన్నారు.

# మచిలీపట్నం డి ఎల్ పి ఓ గా రజావుల్లా నియామకం



**మచిలీపట్నం, (ఆకాంక్ష న్యూస్) :** మచిలీపట్నం డి ఎల్ పి ఓ గా మొహమ్మద్ రజావుల్లా ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఆయన జంగారెడ్డిగూడెం డివిల్పిఓగా పనిచేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన బదిలీలలో ఆయనను మచిలీపట్నం డివిజన్ కు బదిలీ చేశారు. గతంలో రజావుల్లా గూడూరు మండలం ఈఓపిఆర్ డి గా పనిచేస్తూ డివిల్పిఓగా పదోన్నతి పొందారు.

# రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం:తాడికొండ చిన్నా.

## శ్రీకాకుళం ఆర్బికెలో రాయితీపై సబ్సిడీ విత్తనాల పంపిణీ....



**ఘంటసాల, (ఆకాంక్ష న్యూస్) :** కృష్ణాజిల్లా ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం గ్రామంలోని ఆర్బికెలో మంగళవారం రైతులకు రాయితీపై సబ్సిడీ వరి విత్తనాల పంపిణీ జరిగింది. రైతుల ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పాటుగా, ఖరీఫ్ సాగు కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేసింది. తాడికొండ చిన్నా మాట్లాడుతూ రైతు అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యమని, సాగు అవసరాలకు అన్ని విధాలా సహకారం ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. నాణ్యమైన విత్తనాల లభ్యతతో పాటు రాయితీ ధరలకు అందుబాటులో ఉండటంతో పంటల దిగుబడులు మెరుగుపడతాయన్నారు. పాపవినాశనం టీడీపీ నేత కుంపటి చిట్టిబాబు, శ్రీకాకుళం ఉప సర్పంచ్ శీలం శ్రీనివాస్, గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు కొండవీటి నాని, వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ ప్రభుత్వం కొత్త రేషన్ విధానంలో భాగంగా శ్రీకాకుళంలో వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ సరఫరా..



**ఘంటసాల, (ఆకాంక్ష న్యూస్) :** సామాజిక న్యాయం, ప్రజల సంక్షేమాన్ని ప్రథమ దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రూపొందించిన రేషన్ పంపిణీ విధానంలో భాగంగా వృద్ధుల వంటి నడవలేని లేదా శారీరకంగా బలహీనత ఉన్న లబ్ధిదారులకు వారి ఇంటి వద్దకే రేషన్ సరఫరా చేస్తుంది. ఈ చర్యలో భాగంగా ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళంలో రేషన్ డీలర్ స్వయంగా లబ్ధిదారుల వద్దకు వెళ్లి రేషన్ పంపిణీ చేశారు. పలువురు వృద్ధులు, నడవలేని లబ్ధిదారుల వద్దకు వారి ఇంటికి వెళ్లి శ్రీకాకుళం ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), శ్రీకాకుళం ఉప సర్పంచ్ శీలం శ్రీనివాస్, గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు కొండవీటి నానిలు రేషన్ అందజేశారు.

# విజయోత్సవ బైక్ ర్యాలీని జయప్రదం చెయ్యండి.



**తనకల్లు, (ఆకాంక్ష న్యూస్) :** కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తి అయిన సందర్భంగా కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో జూన్ 12వ తేదీన విజయోత్సవాలలో భాగంగా బైక్ ర్యాలీకి మండల తెలుగుదేశం పార్టీ యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని తెలుగుయవత నాయకులు కిషోర్ గౌడ్ తెలిపారు.

# వర్షాకాలం లోకూడా అన్న క్యాంటీన్ లో పరిశుభ్రమైన వాతావరణము ఉండాలి

## విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం




**విజయవాడ, (ఆకాంక్ష న్యూస్) :** వర్షాకాలంలో అన్న క్యాంటీన్ పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని పటమట లోగల అన్న క్యాంటీన్ ను పరిశీలించిన కమిషనర్ అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా కనకదుర్గ నగర్, పటమట, మహానాడు రోడ్డు, పంట కాలువ రోడ్డు పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నగరంలోని అన్న అన్నింటిలోనూ, పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పాలని, ఆహారము ఉన్న చోట ఈగలు అపరిశుభ్రమైన వాతావరణము లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ ఉండాలని, త్రాగునీటి, వాడుకనేటి సరఫరా నిరంతరం ఉండేటట్టు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని అన్నారు. వర్షాకాలం దృశ్య డీసిల్టింగ్ పనులను శరవేగంగా చేయాలన్నారు. ఒకవేళ డ్రైనులు అన్నిటిలోనూ డిసిల్టింగ్ పనులు పూర్తయినప్పటికీ అవసరమైన ప్రతి డ్రైన్ లో మరలా డీసిల్టింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కనకదుర్గ నగర్ లో నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ ను పరిశీలించారు, నిర్మాణ పురోగతి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ని అడిగి తెలుసుకుని ఎటువంటి ఇబ్బందులు ఉన్న సమస్యలు ఉన్న వెంటనే తమకు తెలియజేయాలని అన్నారు. మానడు రోడ్డు పంట కాలవ రోడ్డు పర్యటించి పరిశుద్ధ నిర్వహణ పరిశీలించారు రోడ్డుపైన వ్యర్ధాలు ఉండకుండా వెంటనే వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, ప్రతిరోజు రోడ్లను శుభ్రపరచాలని విజయవాడ నగరాన్ని పరిశుభ్రమైన నగరంగా ఉంచాలని అన్నారు. ఈ పర్యటనలో ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, పర్యవేక్షణ ఇంజనీర్ పి సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి సామ్రాజ్యం, బయాలజిస్ట్ సూర్యకుమార్, తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో యోగ ఆంధ్ర కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగుతున్నాయి:జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ





**మచిలీపట్నం, (ఆకాంక్ష న్యూస్) :** జిల్లాలో గత మే నెల 21వ తేదీ నుండి మొదలైన యోగ ఆంధ్ర కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ నేతృత్వంలో సంయుక్త కలెక్టర్ యోగాంధ్ర కార్యక్రమాల సంపూర్ణ పర్యవేక్షణ అధికారి గీతాంజలి శర్మ , సమన్వయ అధికారి విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ పోతురాజు పర్యవేక్షణలో యోగాంధ్ర కార్యక్రమాలు సజావుగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా జిల్లాలో 7,19,464 మంది పౌరులను యోగాంధ్రలో చేర్చాలని లక్ష్యం కాగా అందులో 97% ఇప్పటివరకు ఆసక్తి కలిగిన 6,97,437 మంది పౌరుల పేర్లను నమోదు చేశారు. నిర్ణీత లక్ష్యసాధనకు అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారు. గ్రామ వార్డు సచివాలయాల సిబ్బంది గ్రామీణ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, ఉపాధి హామీ సిబ్బందితో సమన్వయం చేసుకొని ఇంటింటికి తిరిగి యోగా విశిష్టతను వివరించి పౌరుల అంగీకారంతో వారి పేర్లను సంబంధిత యాప్ లోనూ వెబ్ పోర్టల్ లోను నమోదు చేస్తున్నారు. జిల్లాలో 144 మాస్టర్ ట్రైనర్లు, 5,132 మంది ట్రైనర్లు ఎంపికయ్యారు. ఇప్పటివరకు 5115 మంది ట్రైనర్లకు మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణ ఇవ్వడం జరిగింది. ప్రతి ట్రైనరు మాస్టర్ ట్రైనర్లకు ఆన్లైన్ డేటాబేస్ ద్వారా అనుసంధానం చేశారు. ప్రతి పౌరుడు ఆన్లైన్ డేటాబేస్ ద్వారా ట్రైనర్ కు అనుసంధానం చేశారు. అందులో 5,004 మంది ట్రైనర్లను 5,91,865 మంది పౌరులకు అనుసంధానం చేశారు. ఒక్కో సచివాలయం పరిధిలో 9 మంది ట్రైనర్లు 150 మంది పౌరులకు యోగా శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. యోగా శిక్షణలో నాణ్యత ప్రమాణాలు విధిగా పాటించడం జరుగుతున్నది. ఇందుకోసం 5,132 వేదికలు అవసరం కాగా ఇప్పటివరకు 4,688 వేదికలను సిద్ధం చేశారు. జిల్లా మొత్తం 7,19,464 మంది పౌరులకు శిక్షణ ఇవ్వాల్సిన లక్ష్యం కాగా పేర్లు నమోదైన 6,98,387 మందిలో ఇప్పటివరకు 22,583 మందికి గత రెండు దశల్లో శిక్షణ ఇచ్చారు. యోగ పోటీలను గ్రామ, మండల, పట్టణ స్థాయిలో నిర్వహించడం జరిగింది. గ్రామస్థాయిలో గత మే నెల 26 నుండి 30వ తేదీ వరకు యోగ పోటీలు నిర్వహించారు. అలాగే మండల, పట్టణ స్థాయిలో ఈనెల 2 వ తేదీ నుండి ఈనెల 7వ తేదీ వరకు నిర్వహించారు. ప్రస్తుతం జిల్లా స్థాయిలో ఈనెల 10వ తేదీ మంగళవారం నుండి 14వ తేదీ వరకు యోగ పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్రస్థాయిలో ఈనెల 16 నుండి 18వ తేదీ వరకు యోగా పోటీలు జరగనున్నాయి. మండల స్థాయిలో యోగ పోటీలు 30 ప్రాంతాల్లో 519 పోటీలు నిర్వహించగా 3,377 మంది పాల్గొన్నారు. అందులో 1,568 మంది విజేతలుగా నిలిచారు. వారందరికీ జిల్లా స్థాయిలో మచిలీపట్నం నగరంలోని చిలకలపూడి పాండురంగ స్వామి ఉన్నత పాఠశాల లో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నుండి యోగా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు 10 నుంచి 18 సంవత్సరాల లోపు జూనియర్ల విభాగం, 18 నుంచి 35 సంవత్సరాల యువతకు, 35 సంవత్సరాల పైబడి ఉన్నవారు సీనియర్ల విభాగంలో యోగ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు డాక్టర్లు ఏ మాధవి, పూర్ణచంద్రరావు, లక్ష్మి సౌజన్య, బి ప్రసన్న, శ్రీదేవి, శాంతి ప్రియ న్యాయ నిర్ణయితలుగా వ్యవహరించారు. ఈనెల 13వ తేదీన ప్రముఖ బౌద్ధక్షేత్రమైన ఘంటసాల లో బౌద్ధ స్థూపం వద్ద ప్రత్యేక యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమాయత్తమవుతుంది. అలాగే ఈనెల 19వ తేదీన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కూడా ప్రత్యేక యోగాంధ్ర కార్యక్రమాలు జిల్లా యంత్రాంగం నిర్వహించనున్నది. ఈనెల 6 వ తేదీన ప్రముఖ నాట్య క్షేత్రమైన మొవ్వ మండలం కూచిపూడిలో జరిగిన ప్రత్యేక యోగాంధ్ర కార్యక్రమాలను రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో నాట్య భంగిమలో ఏర్పాటు చేసిన యోగ కార్యక్రమాలను తిలకించి కృష్ణాజిల్లా యంత్రాంగాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

# ఎం.పి కేశినేని శివనాథ్(చిన్ని కార్యాలయంలో ఘనంగా ఎమ్మెల్యే బాలకృష్ణ జన్మదిన వేడుకలు...



**విజయవాడ,(ఆకాంక్ష న్యూస్) : :** బసవతారకం క్యాన్సర్ హాస్పటల్ చైర్మన్, హిందుపురం ఎమ్మెల్యే పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో ఘనంగా నిర్వహించారు. తెలుగు మహిళలు,టిడిపి నాయకులు, తెలుగు యువత విద్యార్థులు , కార్యకర్తలు ఆనందోత్సహాల మధ్య కేక్ కట్ చేసి బాలకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ తెలుగు సినీ రంగంలో అగ్ర కథానాయకుడిగా రాణిస్తూ బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ చైర్మన్ గా ఎంతో మంది పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్న కల్మషం లేని వ్యక్తి హిందూపురం ఎమ్మెల్యే పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ అంటూ కొనియాడారు. బసవతారకం కేన్సర్ హాస్పిటల్ చైర్మన్గా అనేక మంది క్యాన్సర్ రోగులకు ప్రాణదానం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ , ఎన్టీఆర్ జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి, విజయవాడ పార్లమెంట్ కార్యనిర్వహక కార్యదర్శి చిట్టా నిర్మల, టిడిపి నాయకులు బొప్పన భవనకుమార్, వల్లభనేని నరసింహాచౌదరి, పేటెటి రాజమోహన్, కిలారి చంద్రశేఖర్,బొర్రా గాంధీ, మాదిగాని గురునాథం,కాకు మల్లిఖార్జునరావు, సంకె విశ్వనాథం, పరిశపోగు రాజేష్, ఎమ్.డి. ఇర్ఫాన్, అబీద్ హుస్సేన్,, తెలుగు మహిళ నేతలు రాయి రంగమ్మ, వీరపనేని అరుణ, ఎస్.సున్నాబి, మొకరు రంగ మహాలక్ష్మీ, ఎస్.అమీనా, జి.పండు, ఎస్.కె.ఫాతిమా, గౌరి, శైలు, ఎస్.కె.రమీజా, కె.స్రవంతి, మాదాల రాజ్యలక్ష్మీ, మాదాల సత్య లతో పాటు తెలుగు యువత విద్యార్థులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యుత్ సర్క్యూట్ వల్ల బుడదైన ఇల్లు



**(ఆకాంక్ష న్యూస్) : 09/06/ 2025 :** అడ్డతీగల మండలంలోని జాజిపాలెం గ్రామంలో అల్లాడి వీరబాబు భార్య పాపయమ్మ గార్ల ఇల్లు కరెంట్ షార్ట్ సర్క్యూట్ వల్ల దహనం అవ్వింది సుమారు ఆస్తి నష్టం 2,50,000/- రూ. రెండు తులాల బంగారం వెండి, విద్యార్హత సర్టిఫికెట్స్ భూమి పట్టాలు, వంట పాత్రలు, బట్టలు కాలి బూడిద అయ్యాయి. కట్టుబట్టలతో కుటుంబం రోడ్డున పడింది. పాడేరు నుంచి అదే గ్రామం మీదుగా స్వగ్రామం అయిన నూగుమామిడి వెళ్ళుచున్న పోలీస్ శాఖ ఉద్యోగి బొగ్గుల బుల్లిరెడ్డి గారు రెండు వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. మాజీ ఎమ్మెల్యే శ్రీమతి వంతల రాజేశ్వరి గారు కూడా సంఘటన స్థలాన్ని సందర్శించి భరోసా ఇచ్చి ప్రభుత్వం ద్వారా తగు సహాయం వచ్చే విధంగా చూస్తానని తెలపటం జరిగింది.

# కృష్ణలంక జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

## కృష్ణలంక సత్యం హెూటల్ దగ్గర వాహనాల వేగాన్ని తగ్గించేందుకు చర్యలు

- నేతాజీ బ్రిడ్జీ దగ్గర ట్రాఫిక్ సిగ్నల్స్ మరమ్మత్తులు
- సత్యం హెూటల్, నేతాజీ బ్రిడ్జి దగ్గర సబ్-వేల నిర్మాణం
- పోలీస్, జాతీయ రహదారుల శాఖ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్



**పటమట, (ఆకాంక్ష న్యూస్) :** తూర్పు నియోజకవర్గ పరిధిలోని ప్రమాదకర ప్రాంతాలైన కృష్ణలంక సత్యంగారి హెూటల్ సెంటర్, స్క్యూబ్రిడ్జి, రైతుబజార్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిందిగా తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ట్రాఫిక్, జాతీయ రహదారుల శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ నేషనల్ హైవే అధారిటీ అ్యధికారులతో పాటుగా, కృష్ణలంక సీఐ నాగరాజుతో సమావేశమై ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేకగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ కృష్ణలంక ప్రాంతంలో సుమారు లక్ష మందికిపైగానే ప్రజలు ప్రమాదకరంగా ఉన్న జాతీయ రహదారిని నిత్యం దాటుతూ ఉంటారని చెప్పారు. జాతీయ రహదారి దాటే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని, దీని వల్ల ప్రజలు చాలా భయపడుతున్నారని తెలిపారు. సత్యంగారి హెూటల్ దగ్గర, రైతు బజార్ దగ్గర బారికేడ్లను మూసివేయడం వల్ల ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారన్నారు. రాణిగారితోట నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం దగ్గర ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయడం లేదని, వాటిని పనిచేసేలా చూడాలని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అధికారులను ఆదేశించారు. సత్యం గారి హెూటల్ దగ్గర వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు డ్రమ్ములను అక్కడ ఉంచి వాటికి రేడియం స్టిక్కర్లను అంటించడం ద్వారా వాహనాల వేగం తగ్గుతుందని దీనివల్ల ప్రమాదాల సంఖ్య కూడా తగ్గుతుందని సూచించారు. రైతుబజార్ దగ్గర ఉన్న బారికేడ్లను రాత్రి 9 గంటలకు మూసి వేసి, ఉదయం 6 గంటల తెరచే విధంగా చేయడం వల్ల స్థానికులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సిందిగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అధికారులను ఆదేశించారు. సత్యం గారి హెూటల్, నేతాజీ సూభాష్ చంద్రబోస్ బ్రిడ్జి దగ్గర సబ్‌వేలు నిర్మాణం చేయడం వల్ల ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఆ దిశగా ఉన్న అవకాశాలను పరిశీలించాల్సిందిగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ జాతీయ రహదారుల శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఏమాత్రం అసౌకర్యం కలగకుండా చూడాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంత ఖర్చు అయినా వెనుకాడకుండా మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. ఈ కార్యక్రమములో స్థానిక టీడీపీ నాయకులు గొరిపర్తి నామేశ్వరరావు, వేములపల్లి రంగారావు, కేశవం భావన్నారాయణ, కొర్రా అప్పన్న, పెద్ది అన్నారావు, జనసేన నాయకులు కొవ్వూరు కిరణ్, తోట శ్రీనులతో పాటుగా కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ వెంట ఉన్నారు.

# నందివాడ మండలంలో పండగల జరుగుతున్న రోడ్ల ప్రారంభోత్సవాలు

### తమిరిశ, రుద్రపాక, లక్ష్మీ నరసింహపురం గ్రామాల్లో రూ.1.26కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న సీ.సీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము





**నందివాడ, (ఆకాంక్ష న్యూస్) :** ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా అన్ని విధాలుగా కృషి చేస్తున్నానని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. నందివాడ మండలంలోని తమిరిశ, రుద్రపాక, లక్ష్మీ నరసింహపురం గ్రామాల్లోరూ. 1.26 కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న 17 రోడ్లను ఎమ్మెల్యే రాము మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన సభల్లో ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ రాబోవు రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు సురక్షిత త్రాగునీరు అందించడం, రోడ్ల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు . ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మాజీమంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, సీనియర్ టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవి, మండల టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, పార్టీ నాయకులు కొల్లి పెద్దబాబు,డి.సీ చైర్మన్ పాలడుగు నానారావు, మాజీ ఎంపీపీ పాలడుగు ధర్మపాల్ఉప్పల వెంకటేశ్వరావు తమరిశ గ్రామ టిడిపి నాయకులు తోట వెంకటేశ్వరరావు, మద్దాల కరుణాకర్ రావు, వేము జీవరత్నం, తోట ధర్మారావు, తోట సాయి గంగరాజు, బండారి వెంకటేశ్వరరావు, తోట సత్తిబాబు, తోట శ్రీనివాసరావు. రుద్రపాక గ్రామ నాయకులు పోలిమెట్ల దేవసహాయం, పావులూరి సాంబశివరావు, పోలిమెట్ల అమ్రోస్, గడ్డం మరియదాస్, పాలేటి దయానిధి.లక్ష్మీ నరసింహపురం టిడిపి నాయకులు గ్రామ పార్టీ అధ్యక్షులు సువారి వెంకట రంగారావు, కృష్ణాజిల్లా కళింగ సాధికార కమిటీ అధ్యక్షులు సింగవరపు ప్రభాకర్ రావు, టిడిపి సీనియర్ నాయకులు సింగవరపు బాబురావు, పూజారి, లక్ష్మీప్రసాదరావు, పమిడిపెంటయ్య,ఎండ ఏడుకొండలు, బుడుమూరి మాధవ, తమ్మినేని దాలయ్య, బిర్లంగి పెద్దిరాజు,గున్ను సూర్యనారాయణ, పలువురు టిడిపి నాయకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.



# బీసీ.మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, బీసీ.కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ కు వినతి పత్రం అందజేసి ఏక్నాథ్ దుగ్గ

**శేరిలింగంపల్లి, (ఆకాంక్ష న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్,బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ ను మంగళవారం వారి కార్యాలయంలో కలిసి గొందలి సమాజ్ సంఘం ను బీసీ జాబితాలో చేర్చాలని వినతి పత్రం అందజేసిన శేరిలింగంపల్లి సీనియర్ కాంగ్రెస్ నాయకులు,తెలంగాణ రాష్ట్ర గొందళి సమాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏక్ నాథ్ దుగ్గే. ఈ సందర్భంగా ఏక్ నాథ్ మాట్లాడుతూ గొందళి సమజ్ సంఘం బీసీ జాబితాలో చేర్చాలని బీసీ జాబితాలో తమ కులం లేకపోవడంతో తమ పిల్లలు,తము చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చాలా ఏళు ్లగా తమ గోడు వెల్లబోసుకుంటున్నామని గత ప్రభుత్వంలో సైతం వినతి పత్రాలు అందజేసిన ఎలాంటి స్పందన లేకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తమ సంఘమును బీసీ జాబితాలో చేర్చి తమ సమస్యలు పరిష్కరించాలని బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్,కు బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ కు వినతి పత్రం అందజేసిన శేరిలింగంపల్లి సీనియర్ కాంగ్రెస్ నాయకులు,తెలంగాణ రాష్ట్ర గొందళి సమజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏక్ నాథ్ దుగ్గే.సానుకూలంగా స్పందించిన బీసీ మంత్రి ఉన్న ప్రభాకర్ గౌడ్,బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్.ఈ కార్యక్రమంలో యు.సందీప్, జి.అనిల్, ఆర్.సూరజ్, కె.పండరి, ఆర్.జగదీష్,గొందళి సమసజ్ సంఘం సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# టిడిపినాయకుల ఆధ్వర్యం లో రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ.

**తనకల్లు, (ఆకాంక్ష న్యూస్) :** తనకల్లు మండలంలోని తవళం పంచాయతీలో మంగళవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారులు ఆధ్వర్యంలో రైతులకు విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేశారు. మన ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రైతుల అభ్యున్నతి సాధ్యమవుతుందని అందుచేత 40% సబ్సిడీతో ప్రభుత్వం ఇచ్చే వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నామని కనుక రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మండల వ్యవసాయ శాఖ కార్యాలయం అధికారులను సంప్రదించి సబ్సిడీ వేరుశనగ విత్తనాలను తీసుకోవాలని ఈ సందర్భంగా టిడిపి నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్ తవళం ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఈశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రమణప్ప, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, చారుపల్లి కృష్ణారెడ్డి,చిన్ని కృష్ణ, తెలుగు యువత నాయకులు షేక్ మబ్బాష, సచివాయల సిబ్బంది జహీర్, చిన్ని కృష్ణ తదితరులు



# రోగులకు సీఎం సహాయనిధి వరం:యార్లగడ్డ



**గన్నవరం,(ఆకాంక్ష న్యూస్) :** రోగుల పాలిట ముఖ్యమంత్రి సహాయనిధి వరంగా మారి వారిని ఆర్థికంగా ఆదుకుంటుందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. గన్నవరం నియోజకవర్గం లోని పలువురు రోగులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన ఎల్ఓసిలు, చెక్కులను రోగుల కుటుంబ సభ్యులకు యార్లగడ్డ అందజేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో బాపులపాడు మండలం వేలేరు గ్రామానికి చెందిన షేక్ నబియాకు రూ.2 లక్షలు, ఇదే మండలం మల్లవల్లి గ్రామానికి చెందిన కట్టుబోయిన రమాదేవికి లక్ష రూపాయలు, విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు గ్రామవాసి కొంపల్లి త్రిశాంఖ్ కు రూ. 2 లక్షల చెక్కును యార్లగడ్డ అందించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న రోగులకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఉదారంగా నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పేద రోగులకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు తమ ప్రభుత్వం ఆరోగ్య భీమాను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. గన్నవరం నియోజకవర్గంలో అత్యధికంగా సి.ఎమ్. ఆర్.ఎఫ్ నిధులు తీసుకువచ్చినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా రోగుల కుటుంబ సభ్యులు యార్లగడ్డ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గూడపాటి తులసి మోహన్, ఆవిర్నేని భవాని శంకర్, కాజ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలం లోకూడా అన్న క్యాంటీన్ లో పరిశుభ్రమైన వాతావరణము ఉండాలి

## విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం

**విజయవాడ,(ఆకాంక్ష న్యూస్) :** వర్షాకాలంలో అన్న క్యాంటీన్ పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని పటమట లోగల అన్న క్యాంటీన్ ను పరిశీలించిన కమిషనర్ అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా కనకదుర్గ నగర్, పటమట, మహానాడు రోడ్డు, పంట కాలువ రోడ్డు, రాణి గారి తోట కృష్ణలంక ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నగరంలోని అన్న అన్నింటిలోనూ, పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పాలని, ఆహారము ఉన్న చోట ఈగలు అపరిశుభ్రమైన వాతావరణము లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ ఉండాలని, త్రాగునీటి, వాడుకనేటి సరఫరా నిరంతరం ఉండేటట్టు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని అన్నారు. వర్షాకాలం దృశ్య డీసిల్టింగ్ పనులను శరవేగంగా చేయాలన్నారు. ఒకవేళ డ్రైనులు అన్నిటిలోనూ డిసిల్టింగ్ పనులు పూర్తయినప్పటికీ అవసరమైన ప్రతి డ్రైన్ లో మరలా డీసిల్టింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.రాణి తోట కృష్ణలంక లో నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ ను పరిశీలించారు, నిర్మాణ పురోగతి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ని అడిగి తెలుసుకుని ఎటువంటి ఇబ్బందులు ఉన్న సమస్యలు ఉన్న వెంటనే తమకు తెలియజేయాలని అన్నారు. మానడు రోడ్డు పంట కాలవ రోడ్డు పర్యటించి పరిశుద్ధ నిర్వహణ పరిశీలించారు రోడ్డుపైన వ్యర్థాలు ఉండకుండా వెంటనే వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, ప్రతిరోజు రోడ్లను శుభ్రపరచాలని విజయవాడ నగరాన్ని పరిశుభ్రమైన నగరంగా ఉంచాలని అన్నారు.ఈ పర్యటనలో ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, పర్యవేక్షణ ఇంజనీర్ పి సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి సామ్రాజ్యం, బయాలజిస్ట్ సూర్యకుమార్, తదితరులు పాల్గొన్నారు

# గృహ తనఖా రుణాల పరిమితి రూ.40 లక్షలకు పెంపు.

**గూడూరు, (ఆకాంక్ష న్యూస్) :** కృష్ణా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ద్వారా అందించే తనఖా గృహరుణాల పరిమితిని 40 లక్షలకు పెంచుతూ సీఈవో శ్యామ్ మనోహర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. గూడూరు గ్రామ పరిధిలో ఇప్పటివరకు తనఖా గృహ రుణాల పరిమితి రూ.10 లక్షలు మాత్రమే ఉంది. విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గూడూరులో ప్రస్తుతం భూముల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. అయినప్పటికీ కేడిసిసి బ్యాంకు మాత్రం రూ. పది లక్షలు పరిమితికి లోబడి మాత్రమే తనఖా రుణాలు ఇస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో కేడిసిసి బ్యాంక్ పూర్వ డైరెక్టర్ తలుపుల వెంకటకృష్ణారావు తనఖా గృహ రుణాల పరిమితిని పెంచాలంటూ సీఈఓకు లేఖ రాశారు దీనిపై స్పందించిన సీఈఓ శామన్నర్ జూన్ 10 నుంచి తీసుకునే గృహ తన కారణాల పరిమితిని రూ.40 లక్షలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. కేడీసీసీ బ్యాంకు నిర్ణయం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రుణ పరిమితి పెంపుకు ప్రత్యేక చొరవ తీసుకున్న కేడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావును అభినందిస్తున్నారు.

# అంత్యక్రియలకు కాగిత ఆర్థిక సాయం



**పెడన, (ఆకాంక్ష న్యూస్) :** పెడన మండలం దావోజీ పాలెం దళిత వాడలో మృతిచెందిన కటికల ఆశీర్వాదం అంత్యక్రియల నిమిత్తం గ్రామ పంచాయితీ ఉపసర్పంచ్ కాగిత లక్ష్మీ నాగేశ్వరరావు ఐదువేల రూపాయల ఆర్థిక వితరణ చూపారు. ఈ సాయాన్ని జర్నలిస్టు పుట్టి కృష్ణ ప్రసాద్ ఆశీర్వాదం కుటుంబ సభ్యులకు బుధవారం ఉదయం దళితవాడ లో అందించారు. మృతుని కుటుంబ సభ్యులకు నాగేశ్వరావు కృష్ణ ప్రసాద్ లు సానుభూతి తెలిపారు.

# షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికైన హసీబా




**తనకల్లు,(ఆకాంక్ష న్యూస్) : :** 2024-25 సంవత్సరానికి గాను పదవ తరగతి పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ అవార్డులను అందజేసింది. ఈ అవార్డుకు తనకల్లు మండల%శీ% కొక్కంటి క్రాస్ లోని సాయిబాబా స్కూల్ విద్యార్థిని యం. హసీబా ఎంపిక అయిందని కరస్పాండెంట్ యం. సలీం భాష తెలిపారు. మా పాఠశాల విద్యార్థికి ప్రతిభ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని, భవిష్యత్తులో మా పాఠశాల విద్యార్థులు మరిన్ని ప్రతిభ అవార్డులు తీసుకొస్తారనీ ఈ సందర్భంగా ఆయన అన్నారు. ప్రతిభ అవార్డుకు ఎంపికైన విద్యార్థలకు సోమవారం పుట్టపర్తి లోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ 20,000 నగదు బహుమతి, మెడల్, అప్రిషియేషన్ సర్టిఫికెట్ అందజేశారు. ప్రతిభ అవార్డ్ కు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావుకు 14 రోజుల రిమాండ్



హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) : సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావుకు గుంటూరు జిల్లాలోని మంగళగిరి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. అనంతరం ఆయన్ను గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. ఏపీ రాజధాని అమరావతిని కించపరిచారని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ కంభంపాటి శిరీష ఫిర్యాదు మేరకు తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో ఆయనపై కేసు నమోదైంది. ఇదిలా ఉంటే అమరావతి మహిళలను ఉద్దేశించి జర్నలిస్టు కృష్ణంరాజు చేసిన అసభ్యకర వ్యాఖ్యలను జాతీయ మహిళా కమిషన్ సుమోటోగా తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర డీజీపీకి ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్ విజయ రహత్కర్ లేఖ రాశారు. ఈ వ్యవహారంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారో మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

### అసలేం జరిగిందంటే..

ఓ టీవీ ఛానల్‌లో నిర్వహించిన చర్చ సందర్భంగా అమరావతి రాజధానిపై జర్నలిస్టు కృష్ణంరాజు అసభ్య వ్యాఖ్యలు చేశారు. అమరావతి వేశ్యల రాజధాని అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలతో ఏపీవ్యాప్తంగా నిరసనలు చెలరేగాయి. ఈ క్రమంలో రాజధాని రైతులు, మహిళలు, ఏపీ రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ కంభంపాటి శిరీష ఫిర్యాదు మేరకు ఏపీ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కొమ్మినేనితో పాటు, జర్నలిస్టు కృష్ణంరాజు, సాక్షి టీవీ యాజమాన్యంపైనా కేసు నమోదు చేశారు. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం హైదరాబాద్ జర్నలిస్ట్ కాలనీలోని కొమ్మినేని నివాసానికి వెళ్లి ఆయన్ను ఏపీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# ఢిల్లీ లో ఘోర అగ్ని ప్రమాదం...ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి



డిల్లీ (ఆకాంక్ష న్యూస్) : దేశ రాజధాని ఢిల్లీ లో ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. ద్వారకా ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో మంగళవారం ఉదయం పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ద్వారకా సెక్టార్-13 లోని శపథ సొసైటీలో మంగళవారం ఉదయం 9:58 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అపార్ట్‌మెంట్‌లోని ఎనిమిది, తొమ్మిది అంతస్తుల్లో మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు పెద్ద ఎత్తున ఎగసిపడ్డాయి. దీంతో అప్రమత్తమైన నివాసితులు ప్రమాదం నుంచి తప్పించుకునే క్రమంలో భవనంపై నుంచి కిందకు దూకేశారు. అలా ప్రాణాలను కాపాడుకునే క్రమంలో తండ్రి, ఇద్దరు పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. ముందుగా పదేళ్ల ఇద్దరు చిన్నారులు ప్రమాదం నుంచి బయట పడేందుకు బాల్కనీ నుంచి కిందుకు దూకేశారు. పిల్లల తండ్రి 35 ఏళ్ల యష్ యాదవ్ కూడా కిందకు దూకాడు. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. అధికారులు వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించగా.. అప్పటికే వారు ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు నిర్ధరించారు. పలువురు నివాసితులు ఈ మంటల్లో చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు వెంటనే ఘటనా స్థలికి చేరుకొని ఎనిమిది ఫైరింజన్ల సాయంతో మంటలను ఆర్పివేస్తున్నారు. భవనంలో చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

# అక్టోబర్ 2న మహిళా సంఘాల సోలార్ ప్లాంట్ల ప్రారంభం: మంత్రి సీతక్క



హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) : మహిళా సంఘాల సోలార్ ప్లాంట్లను అక్టోబర్ 2న ప్రారంభించాలని మంత్రి సీతక్క అధికారులకు ఆదేశాలు జారీ చేశారు ఐదులోపు పిల్లలకు అవసరమైన శస్త్రచికిత్సలు చేయిస్తామని తెలంగాణ మంత్రి సీతక్క తెలిపారు. త్వరలో బాలభరోసా పథకం ప్రారంభం చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా ఆమె కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడారు... 22 జిల్లాల్లో నవంబర్ లోపు ఇందిరా మహిళా శక్తి భవనాలు నిర్మించాలని చెప్పారు. పాఠశాలలు ప్రారంభం రోజే విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ చేయాలన్నారు. వెయ్యి అంగన్వాడీ భవనాలు నిర్మిస్తామని సీతక్క పేర్కొన్నారు.

# హరీష్‌రావుకు హైకోర్టులో ఊరట



హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) : మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావుకు హైకోర్టులో ఊరట లభించింది. హరీష్‌రావుపై దాఖలైన ఎన్నికల పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. ఎన్నికల సమయంలో తప్పుడు వివరాలను వెల్లడించాడని చక్రధర్‌గౌడ్ హైకోర్టులో పిటిషన్ వేశాడు. మంగళవారం చక్రధర్ గౌడ్ వేసిన పిటిషన్ పై కోర్టు విచారణ చేపట్టింది. హరీష్‌రావు తరుపున మాజీ అడిషనల్ అడ్వకేట్ జనరల్ రాంచందర్‌రావు వాదనలు వినిపించారు. పిటిషనర్ ఎలాంటి ఆధారాలు నిరూపించకపోవడంతో న్యాయస్థానం.. పిటిషన్ ను కొట్టివేస్తున్నట్లు తెలిపింది.

# న్యూ షావోలిన్ కంగూ అకాడమీ సమ్మర్ క్యాంప్ బెల్ట్ టెస్ట్ మెరిట్ సర్టిఫికెట్లు అందజేత



చిలకలూరిపేట, (ఆకాంక్ష న్యూస్) : చిలకలూరిపేట సి.ఆర్ క్లబ్ నందు నడుపబడుతున్న న్యూ షావోలిన్ కుంగ్ ఫూ అకాడమీ విద్యార్థులు ఈ సమ్మర్ ఉచితంగా నేర్పించబడిన మార్షల్ ఆర్ట్స్ విద్యకు సంబంధించిన బెల్ట్ టెస్ట్ ప్రతిభ సర్టిఫికెట్లను అకాడమీ వారు స్థానిక రజక కమ్యూనిటి హాలు నందు కార్యక్రమం ఏర్పాటు చేసినారు. దీనికి అతిధులుగా న్యూ షావోలిన్ కుంగ్ ఫు అకాడమీ గౌరవ అధ్యక్షులు, జాతీయ బి.సి సంక్షేమసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దుల వెంకట కోటయ్య, ప్రముఖ న్యాయవాది దాసరి చిట్టిబాబు, లాలుదాసావాబ్ సేవాసమితి అధ్యక్షులు కరిముల్లా, అకాడమీ లీగల్ అడ్వయిజర్ పేరం నగేష్ బాబు, అడాడమీ చీఫ్ షేక్ దరియా వలి, విజయవాడ కుంగ్ ఫు మాస్టర్స్ బి. వెంకట్, రసూల్ పాల్గొని విద్యార్థులకు బెల్టులు మరియు ప్రతిభ సర్టిఫికెట్లను అందజేశారు. దాసరి చిట్టిబాబు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా ఇలా ఎంతోమంది విద్యార్థిని, విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్ లో ఉచిత శిక్షణ ఇస్తూ వారిని మంచిగా ట్రైన్ చేస్తున్న మాస్టర్లను అభినందించారు. షేక్ కరిముల్లా మాట్లాడుతూ సేవా కార్యక్రమంలో భాగంగా ఇలా ఉచిత శిక్షణా కార్యక్రమం నిర్వహించడం, ముఖ్యంగా ఆడపిల్లలను ఈ సమాజంలో మంచి యోధురాళ్ళుగా, సివంగులుగా వారిలోని ప్రతిభను ప్రేరేపించే విధంగా వారికి శిక్షణనిస్తూ మానసికంగా ఆత్మరక్షణకు అవసరమైన శిక్షణను తీసుకుంటున్న విద్యార్థినులకు వారి తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. మద్దుల వెంకట కోటయ్య మాట్లాడుతూ అకాడమీ స్థాపించిన నాటి నుండి నేటి వరకు అకాడమీకి సంబంధించిన ప్రతి కార్యక్రమానికి తనవంతు సహాయసహకారాలు అందజేసుకుంటూ మంచి కార్యక్రమాలను ఎప్పుడూ ప్రోత్సహించాలని, అదేవిధంగా మా అకాడమీ నిర్వహించే టోర్నమెంట్లలో మా విద్యార్థులు ఎన్నో జాతీయ స్థాయిలో, రాష్ట్రస్థాయిలో, జిల్లా స్థాయిలో విద్యార్థులు విజేతలుగా నిలవటం అలానే మున్ముందు రోజుల్లో కూడా దీనికి సంబంధించిన ఇంకా వారికి శిక్షణకు కావలసిన కిట్లను కూడా త్వరలో అందజేయుటకు ముందుంటామని, ప్రభుత్వం గుర్తించబడినట ువంటి ఊషు క్రీడను కూడా మాకు రావడం, దానికి సంబంధించిన ప్రతి విద్యార్థికి అందేవిదంగా అకాడమీ వారు ఎప్పుడూ ముందుంటారని, వారితో మేము కూడా ఉంటామని తెలియజేస్తూ ఈ నెల 14వ తారీకున జైపూర్లో జరగనున్న ఊషూ జాతీయ స్థాయి సీనియర్ టోర్నమెంటుకు వెళుతున్నటువంటి మాస్టర్ విక్రమ్, వారి విద్యార్థులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు, వారు విజేతలుగా నిలవాలని ఆంధ్రప్రదేశ్ పేరు నిలబెట్టాలని కోరారు. మాస్టర్ యడ్ల సురేష్ మాట్లాడుతూ ఒక సమ్మర్ క్యాంప్ మాత్రమే కాకుండా ప్రతిరోజు ఉదయం గం. 6.00 నుండి గం. 7.30 వరకు ఉచిత మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ఇవ్వబడుతుంది, ప్రతి తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులకు ఈ విద్యను ఇప్పించవలసినదిగా కోరారు. తదుపరి వారి చేతుల మీదుగా సర్టిఫికెట్లు, బెల్టులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమీ మాస్టర్స్ పాలపాటి నాగరాజు, కొర్రపాటి రాంబాబు, కుర్చేటి బ్రహ్మయ్య, కాకి ప్రసాద్, ఇన్ స్ట్రక్టర్స్ యస్.కె. రబ్బాని, యం.దుర్గా ప్రసాద్, బ్లాక్ బెల్టర్స్ సాకేత్, సుధీర్, ఖమృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# పీఎండీఎస్ విత్తనాల వినియోగానికి ప్రోత్సాహం.

## ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం కె అమల కుమారి ఉన్నవ గ్రామ సందర్శన
## ప్రకృతి రైతులకు ప్రీ మాన్సూన్ డ్రైవ్ సోయింగ్‌పై అవగాహన



ఎడ్లపాడు ,(ఆకాంక్ష న్యూస్) : మండలంలోని ఉన్నవ గ్రామంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె అమల కుమారి ఎన్‌పిఎమ్ నాన్ పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ షాప్‌ను సందర్శించారు. గ్రామానికి చెందిన కోటేశ్వరమ్మ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ షాప్ ద్వారా రైతులకు ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన ఘన జీవామృతం, కషాయాలు, పీఎండీఎస్ విత్తనాలు లభ్యమవుతున్నాయని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమలకుమారి మాట్లాడుతూ, ప్రస్తుత వర్షాకాలాన్ని ఉపయోగించుకొని రైతులు తమ పొలాల్లో ప్రీ%-%మాన్సూన్ డ్రైవ్ సోయింగ్ విత్తనాలను వేసుకోవాలని సూచించారు. ఇది ఖరీఫ్ పంటలకు ముందు భూమిని సన్నద్ధం చేసేందుకు ఎంతగానో సహకరిస్తుందని చెప్పారు. ఈ కిట్లో 30 రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. వాటిలో పప్పు ధాన్యాలు మినుము, పెసర, బొబ్బర్లు, నూనె జాతులు నువ్వులు, ఆముదం, వేరుశనగ, సుగంధ ద్రవ్యాలు ధనియాలు, మెంతులు, ఆవాలు, ధాన్యాలు రాగులు, మొక్కజొన్న, కొర్రలు, కూరగాయలు, ఆకుకూరలు, తీగజాతులు మొదలైనవి ఉంటాయని తెలిపారు. ఈ విధానం సాగు వల్ల భూమి ఏడాది పొడవునా కప్పబడి ఉండటంతో, నేలలో సూక్ష్మజీవజాల అభివృద్ధికి అనుకూలంగా మారుతుందన్నారు. దీంతో ప్రధాన పంటలకు అవసరమైన పోషకాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఇలా నవధాన్యాల ఉత్పత్తికి తోడ్పడడమే కాకుండా, పశువులకు పోషక మేతగా కూడా ఉపయోగపడుతుందని రైతులకు అవగాహన కల్పించారు. అలాగే పీఎండీఎస్ విత్తనాల వినియోగం వల్ల వర్షపు నీటి నిల్వ సామర్థ్యం పెరుగడం, అదనపు పంటల ద్వారా రైతులకు ఆదాయం లభిస్తుందన్నారు. నేల సారాన్ని మెరుగుపరచి జీవవైవిధ్యాన్ని కాపాడుతుందని తెలిపారు. రసాయన వాడకాన్ని తగ్గుతుందని, కలుపు, తెగుళ్ల సమస్యలు తగ్గి..పంట వాతావరణ మార్పులకు తట్టుకునే స్థాయికి చేరతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జ్ కోటేశ్వరమ్మ, మాస్టర్ ట్రైనర్ బేబీరాణి, ఎన్‌సీఆర్‌పి పాములు పాల్గొన్నారు.

# అమరావతిపై విషప్రచారాలను ప్రజలు సహించరు

- జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజీ......
- మహిళలను కించపరిచేలా మాట్లాడితే ఎంతటి వాడికైనా శిక్ష తప్పదు....

చిలకలూరిపేట, (ఆకాంక్ష న్యూస్) : తాను నాశనం చేయాలనుకున్న రాజధాని అమరావతి పునర్నిర్మాణం చేస్తూంటే సహించలేక వైసీపీ నాయకులు విషం కక్కుతున్నారని, రోజుకో అసత్య ప్రచారంతో మహిళలను సైతం అవమాన పరుస్తున్నారని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజి అన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బాలాజి మాట్లాడుతూ రాజధాని అమరావతి అంటే వేల మంది రైతుల త్యాగమని గుర్తు చేశారు. రాజధాని అమరావతిగా ఉండాలని ఈ ప్రాంతానికి చెందిన రైతులు 1630 రోజులు అందోళనలు చేశా రని, ఇందులో 270 మంది చనిపోయారని పేర్కొన్నారు. ఎంతో మంది త్యాగాలతో రూపుదిద్దుకుంటున్న అమరావతిపై విష ప్రచారం చేస్తే ప్రజలు సహించరన్నారు. సాక్షి న్యూస్ చానెల్స్ సత్య బద్ధంగా నిర్వహించాల్సింది పోయి అసభ్య పదజాలంతో ప్రచారం చేస్తున్నారు, సాక్షి ఛానెల్ యాజమాన్యం పై చర్య తీసుకోవాలి, వై ఎస్ భారతి ని అరెస్ట్ చేయాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. రాజకీయ మెప్పుకోసం విడదల రజని, రోజా సెల్వమని భారతి భజన చేస్తూ వాళ్ళు ఆడవాళ్లినని మర్చిపోయారని విడదల రజని కూడా రాజధాని ప్రాంత మైన గుంటూరు లోనే నివాసం ఉంటున్నదని మర్చిపోయిందేమో గుర్తుచేసుకోవాలని విమర్శించ్చారు.

నాడు అమరావతి రైతుల ఉద్యామాన్ని అణిచివేసి వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి రైతుల ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణిచివేసి వైఎస్ జగన్ చరిత్రలో నిలిచిపోయారని బాలాజి గుర్తు చేశారు. నాటి నుంచి వారు చేపట్టిన ఆందోళనలు, దీక్షలు వేలాది రోజుల పాటు కొనసాగాయని, తమ గోడు వెళ్లబోసుకునేందుకు నాడు సీఎం గా ఉన్న వైఎస్ జగన్ అపాయింట్‌మెంట్ సైతం ఇవ్వలేదని గుర్తు చేశారు, అలా తమ మొర ఆ దేవదేవుడితో చెప్పుకునేందుకు రాజధాని ప్రాంత రైతులు ప్రయత్నించారని తెలిపారు. న్యాయస్థానం నుంచి దేవస్థానం, అలాగే అమరావతి నుంచి అరసవల్లి వరకు పాదయాత్రలు సైతం చేపట్టారని, ఆ సమయంలో జగన్ వారిపై తీవ్ర ఆంక్షలు సైతం విధించిన విషయం ప్రజలు మరిచిపోలేదన్నారు. రాజధాని పునర్నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల శంకుస్థాపన చేశారని, సుమారు రూ. 77,200 కోట్లతో పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇది చూసి వైసీపీ నేతలు అక్కసు వెళ్లగక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి విషయంలో వైసీపీ ఆడే నాటకంలో పావులు కావద్దని హితవు పలికారు. ఆంధ్రుల రాజధాని అమరావతిపై విషం కక్కితే సహించేది లేదని హెచ్చరించారు.



# రాజస్థాన్‌లో విషాదం..నది లో ఈతకు వెళ్లి ఎనిమిది మంది మృతి



రాజస్థాన్(ఆకాంక్ష న్యూస్) : : రాజస్థాన్‌లో విషాదం చోటు చేసుకుంది. టోంక్ జిల్లాలోని బనసా నది లో ఈతకు వెళ్లి ఎనిమిది మంది యువత ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురిని స్థానికులు రక్షించారు. టోంక్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వికాస్ సంగ్వాన్ తెలిపిన వివరాల ప్రకారం.. 25 నుంచి 30 ఏండ్ల మధ్య వయసున్న 11 మంది యువత మంగళవారం ఈత కొట్టేందుకు బనసా నదికి వెళ్లారు. అక్కడ నదిలోకి దిగి స్విమ్ చేస్తూ గల్లంతయ్యారు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన టోంక్ పోలీసులు.. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సాయంతో నదిలో మునిగిపోయిన వారిని రక్షించేందుకు ప్రయత్నించారు. ముగ్గురిని ప్రాణాలతో రక్షించగా.. ఎనిమిది మంది నీటిలో మునిగి మృతి చెందారు. మృతదేహాలను నదిలోనుంచి వెలికి తీసిన పోలీసులు అనంతరం పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# లాభనష్టాలు చూడకుండా రైతుల కష్టానికి విలువ ఇవ్వండి:మాజీమంత్రి ప్రత్తిపాటి

రైతులు సాగుచేయకుంటే తమ కంపెనీలు ఉండవనే నిజాన్ని యాజమాన్యం, ప్రతినిధులు గుర్తించాలి.







**ప్రతి రైతు వద్ద ఉన్న పొగాకు నిల్వలు కొనాల్సిన బాధ్యత కంపెనీలదే.**

చిలకలూరిపేట ,(ఆకాంక్ష న్యూస్) : బర్లీ పొగాకు రైతులకు అన్యాయం జరిగితే ముఖ్యమంత్రి సహించరని, కూటమిప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలన్న ధృఢచిత్తంతో ఉందని, ఇచ్చిన మాటకు కట్టుబడి కంపెనీలు రైతుల్ని ఆదుకోవాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. పల్నాడు జిల్లా కలెక్టరేట్లో బర్లీ పొగాకు కొనుగోళ్లపై కలెక్టర్ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన అత్యున్నతస్థాయి సమావేశంలో ప్రత్తిపాటి రైతులు, బయ్యర్లకు పలు కీలకసూచనలు చేశారు. తమ వద్ద ఉన్న పొగాకునిల్వలు అమ్ముకోవడానికి ఇన్నాళ్లు వేచిచూసిన రైతులకు తప్పకుండా న్యాయం జరుగుతుందన్న ప్రత్తిపాటి, కొనుగోలుదారుల ఒత్తిడితో ఎవరూ తొందరపడి తక్కువ ధరకు అమ్ముకోవద్దని హితవుపలికారు. ప్రభుత్వ ఒత్తిడితో కొనుగోళ్లు ప్రారంభించిన కంపెనీలు మొక్కుబడిగా తక్కువ ధరకు కొని చేతులుదులుపుకునే ప్రయత్నాలు చేయకుండా, రైతులకు నష్టం లేకుండా చూడాలని ప్రత్తిపాటి సూచించారు. పొగాకు కంపెనీలు హామీ ఇచ్చినందునే ఈ సంవత్సరం రైతులు అధికంగా పొగాకు సాగుచేశారని, తమను నమ్మిన రైతుల్ని ఆదుకోవాల్సిన బాధ్యత కంపెనీ యాజమాన్యాలపైనే ఉందని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. లాభనష్టాలు పక్కన పెట్టి, రైతుల కష్టానికి విలువ ఇవ్వాలన్నారు. పెట్టిన పెట్టుబడి కూడా రాకపోతే రైతులు ఎలా బతకాలని, ఎంతకాలం నష్టపోవాలని ప్రత్తిపాటి ప్రశ్నించారు. ప్రభుత్వం నిర్దేశించిన రూ.12వేల ధర ప్రతి రైతుకు అందించాల్సిన బాధ్యత కంపెనీలదేనని, రైతువద్ద ఉన్న చివరి ఆకువరకు కొనేబాధ్యత తీసుకోవాలని ప్రత్తిపాటి ఆదేశించారు. సరుకు బాగాలేదని, రంగు నాణ్యత తగ్గిందని చెప్పకుండా ఈ సంవత్సరం రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రత్తిపాటి కంపెనీల ప్రతినిధుల్ని కోరారు. ప్రధాన కంపెనీలన్నీ రైతులకు అండగా నిలిస్తే, ప్రభుత్వం కూడా తగిన సహాయసహకారాలు అందిస్తుందన్నారు. లాభనష్టాల గురించి ఆలోచించకుండా, నష్టపోయిన రైతుల్ని ఆదుకోవడంపైనే కంపెనీలు శ్రద్ధ పెట్టాలని ప్రత్తిపాటి సూచించారు. నారు ఎంపిక దశలోనే చాలామంది రైతులు నష్టపోయారని, ఇబ్బందులు సమస్యలు అధిగమించి సాగుచేసిన రైతులకు కూడా న్యాయం చేయకపోతే ఎలాగని ప్రత్తిపాటి కంపెనీల ప్రతినిధుల్ని ప్రశ్నించారు. ఎకరాకు రూ.1.25 లక్షల నుంచి రూ.1.50 లక్షలవరకు పెట్టుబడి పెట్టారని, రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా అందివ్వకపోతే ఎలాగన్నారు. ప్రభుత్వసూచనల ప్రకారం కంపెనీలు, బయ్యర్లు పొగాకు రైతులకు న్యాయంచేయాల్సిందేనని ప్రత్తిపాటి తేల్చిచెప్పారు. కొనుగోళ్లలో తొలిప్రాధాన్యత రైతులకే ఇవ్వాలని, వారివద్ద సరుకు లేకపోతేనే ఇతరుల వద్ద కొనాలని మాజీమంత్రి తెలిపారు. కంపెనీలు వాటి తరుపు బయ్యర్లు వెంటనే వేగంగా కొనుగోళ్లు జరపాలని, ప్రభుత్వం కూడా 16వ తేదీ నుంచి మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోళ్లు ప్రారంబిస్తుందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్, డి ఎ వో మురళీ, జిల్లా అధికారులు, చిలకలూరిపేట అగ్రికల్చర్ అధికారులు, నాయకులు వీరారెడ్డి, నెల్లూరి సదాశివరావు , జవ్వాజి మధన్ మోహన్, గట్టినేని రమేష్ , టారిష్, రైతులు పలువురు పాల్గొన్నారు.

# అత్యంత వైభవంగా నృసింహ జయంతి:ఈవో. వేండ్ర త్రినాధరావు



సింహాచలం, (ఆకాంక్ష న్యూస్) : పరమ పవిత్రమైన నృసింహ జయంతి కృష్ణాపురం గోశాలలో గల నృసింహ వనం లో. ఆలయ కార్యనిర్వహణాధికారి వేండ్ర త్రినాధరావు ఆదేశాలతో అత్యంత వైభముగా జరిపెంచారు.నృసింహ జయంతి - సంధ్యాసమయం చాలా ప్రత్యేకం. వైశాఖ మాసం శుక్ల చతుర్థశి నృసింహస్వామి జయంతి. దుష్ట శిక్షణ శిష్ట రక్షణకోం మహావిష్ణువు ధరించిన అవతారాల్లో ఒకటి నృసింహ స్వామి. మనిషి శరీరం - సింహం శిరస్సుతో ఉన్న నృసింహ స్వామి జయంతి వైశాఖ శుద్ధ చతుర్థశి రోజు జరుపుకుంటారు. ఈ రోజు శ్రీ మహావిష్ణువు రాక్షసుడైన హిరణ్యకశిపుడిని సంహరించి ధర్మాన్ని నిలబెట్టాడు.అందుకే ఈ ప్రత్యేక దినాన్ని వేడుకగా జరుపుకుంటారు. శ్రీమహావిష్ణువును, నారసింహుడిని ఆరాధిస్తారు. నారసింహుడి ఉద్భవంకశ్యప మహర్షి-దితి.అసుర సంధ్యలో ఒక్కటైన ఫలితంగా రాక్షస లక్షణాలతో జన్మించాడు హిరణ్యకశిపుడు. హిరణ్యకశిపుడి సోదరుడైన హిరణ్యాక్షుడిని విష్ణుమూర్తి వధించడంతో...అప్పటి నుంచి సోదరుడిపై ప్రేమతో విష్ణువుపై ద్వేషం పెంచుకున్నాడు హిరణ్యకశిపుడు. ఆ పంతంతోనే ఘోర తపస్సు ఆచరించి.. బ్రహ్మనుంచి వరం పొందాడు. ఆకాశం మీద కానీ- భూమ్మీద కానీ , పగలైనా - రాత్రైనా , మనిషి కానీ - జంతువు కానీ..ఎలాంటి అస్త్రాల వల్ల తనకు మరణం లేకుండా వరం కోరుకున్నాడు. తప్పనిసరి పరిస్థితుల్లో సరే అంటాడు బ్రహ్మ. అప్పటి నుంచి లోకాలను శాసించడం మొదలుపెట్టాడు హిరణ్యక శిపుడు. శ్రీహరిపై వైరం పెంచుకున్న హిరణ్యకశిపుడు - విష్ణు భక్తిలో మునిగితేలే లీలావతికి జన్మించినవాడే ప్రహ్లాదుడు. తనయుడిని ఆ భక్తి నుంచి దారిమళ్లించేందుకు ఎన్నో ప్రయత్నాలు చేస్తాడు హిరణ్యకశిపుడు.. ప్రాణాలు తీసుకేందుకు కూడా వెనుకాడడు. అన్ని ప్రయత్నాల్లో విఫలం అయిన తర్వాత ఎక్కడున్నాడు నీ శ్రీహరి చూపించు అంటూ ఓ స్తంభాన్ని పగులగొడతాడు. అందులోంచి ఉద్భవిస్తాడు నారసింహుడు. మనిషి-జంతువు కలగలసిన రూపం, పగలు రాత్రికి మధ్యనున్న సంధ్యాసమయం, భూమి ఆకాశం కాకుండా ద్వారంపై కూర్చుని..గోళ్లే అస్త్రాలుగా రాక్షస సంహారం చేస్తాడు శ్రీహరి. ఇదంతా జరిగింది వైశాఖ శుద్ధ చతుర్థశి రోజే కావడంతో ఈ రోజు నృసింహ జయంతి జరుపుతున్నట్లుగా తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఆలయ సహాయకార్యనిర్వహణాధికారులు పర్యవేక్షణ అధికారులు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫాస్ట్ ఫుడ్ తో రోగాల బారిన పడుతున్న వినియోగదారులు

- చోద్యం చూస్తున్న అధికారులు...
- జాతీయ వినియోదారుల సమాఖ్య ఉపాధ్యక్షులు చదలవాడ హరిబాబు



హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్): ఫాస్ట్ ఫుడ్ తో రోగాల బారిన పడుతున్న వినియోగదారులు చోద్యం అధికారులు చూస్తున్నారని జాతీయ వినియోదారుల సమాఖ్య ఉపాధ్యక్షులు చదలవాడ హరిబాబు అన్నారు.మంగళవారం మాసబ్ ట్యాంక్ లో సీసీఐ అధ్యక్షులు ఆఫీసులో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశమునకు సిసిఐ జాతి ఉపాధ్యక్షులు హరిబాబు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో రంగులు కలిసిన పదార్థాలు తిని రోగాలు బారిన పడుతున్నారన్నారు నిల్వ ఉంచిన చికెను మిగిలిపోయిన కోడిగుడ్లు వంటివి తినడం వలన గ్యాస్ సమస్యలు అల్సర్ వంటి సమస్యలు అధికంగా వస్తున్నాయని ప్రధానంగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో తిన్నవారిలో నోటికి 80 శాతం మంది గ్యాస్ ట్రిక్ అల్సర్ క్యాన్సర్లతోటి బాధపడుతున్నారని అన్నారు సి సి ఏ తెలంగాణ అధ్యక్షులు డాక్టర్ భీమిరెడ్డి అధ్యక్షత వహించారు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు లేవు వంటలకు పామాయిల్ ను వినియోగిస్తున్నారు కళాయిలో అడుగున అన్నం అంటుకుపోకుండా ఉండేందుకు ఎక్కువగా పామ్ ఆయిల్ వాడి తొందరగా పదార్థాన్ని తీసి కస్టమర్లకు అందిస్తున్నారు ఫుడ్ కార్పొరేషన్ నగరపాలక సంస్థ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో ప్రధానంగా ఫ్రైడ్ రైస్ మంచూరియా నూడిల్స్ వంటి పదార్థాల్లో క్యాబేజీ టమోటా ఉల్లిపాయలు కొత్తిమీర వంటి ఆకు కూరగాయలు వినియోగిస్తారు అయితే మార్కెట్లో నాసిరకంగా పక్కన పెట్టిన టమోటాలు ఆకుకూరలు కొత్తిమీర పుదీనా క్యాబేజీ వంటి వాటిని తక్కువ ధర కొనుగోలు చేసి వాటిని పాస్ట్ ఫుడ్ సెంటర్లో వంటల్లో వాడి వినియోగదారులకు అందిస్తున్నారు కోడిగుడ్లు కూడా చికెన్ స్టాల్స్ కోడిగుడ్లు విక్రయించే దుకాణాల్లో పగిలిపోయి ఉన్న వాటిని కొనుగోలు చేసిన వాటిని ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో వాడుతున్నారు అధ్యక్షత వహించిన ప్రసంగిస్తూ రోజులు మారాయి ఉరుకులు పరుగులు జీవనం ఆహార పదార్థాలు ఆకర్షిస్తున్నాయి ప్రస్తుతం సంప్రదాయం వంటకాలు తినేందుకు ఇష్టపడటం లేదు ముఖ్యంగా యువత ఫ్యాషన్ తిండి అలవాటు పడి రోగాలు బారిన పడుతూ వైద్యులను ఆశ్రయిస్తున్నారు గుమగుమలాడే పదార్థాలలో రంగులు నెరవేస్తున్నారు దీంతో ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం పడుతుంది ఎక్కడపడితే అక్కడ కుక్క గొడుగుల్లా వెలుస్తున్న లైసెన్సు లేకుండా వ్యాపారాలు చేస్తున్న అధికారులు మీనమేషాలు ఎక్కడ పెడుతున్నారు వెంటనే సంచార ఆహార ప్రయోగశాలలో ఉన్న వాటి మీద టోల్ ఫ్రీ నెంబర్లు వేయకపోవడం అధికారుల అసమర్థతకు అలసత్వకు నిదర్శనం అన్నారు ఈ కార్యక్రమంలో సీసీఐ కార్యవర్గ సభ్యులు, సిసిఎస్ సెక్రెటరీ సూపర్ బా నారాయణరెడ్డి ప్రసంగించారు

# గొల్లేపల్లి జెడ్.పి.హెచ్.ఎస్ స్కూల్లో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

యాదాద్రి భువనగిరి(ఆకాంక్ష న్యూస్) : యాదాద్రి భువనగిరి జిల్లా వోలిగొండ మండలం గొల్లేపల్లి జెడ్.పి.హెచ్.ఎస్ స్కూల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది.20 సంవత్సరాల తర్వాత పాఠశాల 2004 - 2005 లో పదవ తరగతి చదువుకున్న బ్యాచ్ నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఆనంద ఉత్సవాలు జరుపుకున్నారు ఈ సందర్భంగా తమకు విద్యాబోధన నేర్పిన గురువులను సత్కరించారు.అలాగే ఈ కార్యక్రమాన్ని ముందుండి నడిపించిన పొలగోని యాదవ్వ విద్యార్థి బృందం కృతజ్ఞతలు తెలిపారు.

# కెసిఆర్ తో మరోసారి హరీష్ రావు భేటీ



గజ్వేల్(ఆకాంక్ష న్యూస్) : కాళేశ్వరం కమిషన్ విచారణ నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ తో మరోసారి హరీష్ రావు భేటీ అయ్యారు. మంగళవారం ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లిన హరీష్ రావు, కెసిఆర్ తో సమావేశమయ్యారు. రేపు కాళేశ్వరం కమిషన్ ముందు కెసిఆర్ హాజరుకానున్నారు. దీంతో కమిషన్ ముందు చెప్పాల్సిన అంశాలపై హరీశ్ రావుతో కెసిఆర్ చర్చిస్తున్నట్లు సమాచారం. కాగా, నిన్న జస్టిస్ ఘోష్ కమిషన్ ముందు హరీశ్ రావు విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. విచారణ తర్వాత నేరుగా ఫామ్ హౌస్ కు వెళ్లిన హరీష్ రావు, కెసిఆర్ తో దాదాపు 5 గంటల పాటు భేటీ అయ్యారు. కాగా, ఈ నెల 6న బిజెపి ఎంపి ఈటల రాజేందర్ ను కమిషన్ విచారించింది.

# రామగుండం ట్రాఫిక్ ఏసిపిని మర్యాదపూర్వకంగా కలిసిన ఓదెల మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్




ఓదెల,పెద్దపల్లి జిల్లా (ఆకాంక్ష న్యూస్) : రామగుండం ట్రాఫిక్ ఏసిపిగా ఇటీవల పదవిని చేపట్టిన సి.హెచ్. శ్రీనివాస్‌ను కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓదెల మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ మంగళవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామగుండం ట్రాఫిక్ ఏసిపి కార్యాలయంలో మహేందర్ ఆయనకు పూల బొకే అందించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సన్మానించారు. అవకాశం దొరికిన ప్రతిసారి అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య శుభాకాంక్షల మార్పిడులు పరస్పర గౌరవాన్ని చాటుతున్నాయి.

# ప్రధాని మోడీ పదకొండు సంవత్సరాల పరిపాలన పురస్కరించుకుని మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



ఓదెల, పెద్దపల్లి జిల్లా (ఆకాంక్ష న్యూస్): ప్రధాని నరేంద్ర మోడీ భారత ప్రధానిగా పదకొండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పిలుపు మేరకు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మరియు పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కర్ర సంజీవరెడ్డి ఆదేశాల ప్రకారం, మంగళవారం రోజు ఓదెలలో వృక్షారోపణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఓదెల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం ప్రాంగణంలో, అలాగే మధున పోచమ్మ తల్లి దేవాలయం వద్ద మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి బీజేపీ సీనియర్ నేత క్రాంతి గారు ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఈ వృక్షారోపణ కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ముఖ్యంగా బీజేవైఎం పెద్దపల్లి జిల్లా కార్యదర్శి పుల్లూరి పృథ్వీరాజ్, దాత రాకేష్, అనిల్ రావు, తీర్థలా కుమార్ స్వామి, కారంగుల నవీన్, ఆది సతీష్, బిక్షపతి, తుడి రాజేందర్, సత్యనారాయణ, ముత్యాల సంతోష్, లింగాల గోపాల్ రెడ్డి, చర్లపల్లి రాజు, రామినేని రాజేంద్రప్రసాద్, గతం సాయి తదితరులు పాల్గొన్నారు.పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రధాని మోడీ అభివృద్ధి యాత్రను స్మరించుకునే విధంగా ఈ మొక్కలు నాటే కార్యక్రమం ప్రజల్లో మంచి స్పందనను పొందింది.

# పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం...



గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) : గత ఆరు రోజుల క్రితం గోదావరిఖని సమీప గోదావరి నది ప్రాంతంలో అపస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తుతెలియని మహిళను స్థానికులు గుర్తించి గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి మరియు మానసిక స్థితి బాగా లేనందున వైద్యులు చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతున్న ఆమె ఈరోజు ప్రాణాలు విడిచింది.ప్రస్తుతం ఆమె మృతదేహన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురిలో భద్రపరచినట్టు పోలీసులు తెలిపారు. మృతురాలి వివరాలు ఇప్పటి వరకు తెలియరాలేదని వెల్లడించారు. మహిళను ఎవరైనా గుర్తిస్తే గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి (ఫోన్: 8712656516) నంబరుకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# సింగరేణి క్వాటర్ పై వివాదం...

## కార్మికుడి అన్యాయంపై కలకలం....



**గోదావరిఖని(ఆకాంక్ష న్యూస్) :** సింగరేణి సంస్థ తన కార్మిక సంక్షేమమే ముఖ్యమని ఎన్నో సార్లు ప్రకటించినా, ఆ మాటలు కార్యరూపం దాల్చిన తీరు కనిపించడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. తాజాగా ఓ కార్మికుడికి జరిగిన అన్యాయం సంస్థ ధర్మాన్ని ప్రశ్నించేలా మారింది. కార్మికుడికి తెలియకుండానే అతను నివసిస్తున్న సింగరేణి క్వాటర్‌ను మరొకరికి కేటాయించడమే కాకుండా, ఆ క్వాటర్‌లో ఉన్న అతని సామాగ్రిని ఎవరో తరలించటం కలకలం రేపుతోంది. వివరాల్లోకి వెళితే...సింగరేణిలో పని చేస్తున్న ఓ కార్మికుడు గత కొన్ని సంవత్సరాలుగా కంపెనీ క్వాటర్‌లో ఉంటూ సేవలందిస్తున్నారు. అయితే ఇటీవల అతనికి ఎలాంటి సమాచారం లేకుండానే ఆ క్వాటర్‌ను మరో సింగరేణికి సంబంధంలేని ప్రైవేటు వ్యక్తికి కేటాయించారు. దీనితో సరిపోకుండా, ఆ క్వాటర్‌లో వున్న కార్మికుడి గృహోపయోగ సామాన్లు, అతని వ్యక్తిగత వస్తువులు మాయమయ్యాయి. ఇంతకీ ఎవరు తరలించారు... ? ఎక్కడ పెట్టారు..? అనే విషయాలపై ఇప్పటి వరకు ఎటువంటి స్పష్టత లేదు. దీంతో ఈ ఘటన కార్మికుడి కుటుంబాన్ని కలిచి వేసిన చర్య ఈ ఘటనతో కార్మికుడి కుటుంబం తీవ్ర మానసిక వేదనకు గురైంది. తమ దైనందిన అవసరాల వస్తువులు కనపడకుండా పోవడం,ఇల్లు వదిలించేందుకు ముందు ఎలాంటి సమాచారం లేకపోవడం వారిని ఖంగుతినేలా చేసింది. ఈ చర్యపై వారు కంపెనీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ, ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమని కుటుంబ సభ్యులు వాపోతున్నారు.

### అధికారుల ధోరణిపై ప్రశ్నలు....

సింగరేణిలో నిత్యం నెరపే క్వాటర్ కేటాయింపు ప్రక్రియలో ఇలా కార్మికులకే సమాచారం లేకుండా చర్యలు తీసుకోవడం, సంస్థలో పారదర్శకతపై అనేక అనుమానాలు నెలకొనే విధంగా ఉంది.కార్మికుడికి తెలియకుండా అతని ఇంటి సామాన్లను ఎవరూ తాకే హక్కు ఉండదని కార్మిక సంఘాలు మండి పడుతున్నాయి. దీనికి బాధ్యులెవరన్న ప్రశ్న ఇంకా అనుతరంగా మిగిలిపోయింది. అయితే దీనిపై సింగరేణి సీఅండ్ఎండీ స్పందిస్తారా...?ఈ ఘటనపై సింగరేణి సీఅండ్ఎండీ ఎలా స్పందిస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. కార్మికుల పట్ల అన్యాయం జరుగుతుంటే పైస్థాయిలో ఉన్న అధికారులు స్పందించకపోతే, ఆ సంస్థలో నైతిక విలువలకు ఉన్న స్థాయేంటనే చర్చ మొదలైంది. పైగా కంపెనీ గోడలపై వేలాడే నైతిక బోధనల వాక్యాలు కేవలం ప్రదర్శనకే పరిమితమా అన్న వాదన బలంగా వినిపిస్తోంది. దీనిపై అవసరమైన విచారణ, చర్యలు ఎప్పుడూ..? సామాగ్రిని ఎవరు తరలించారు.. ? ఆదేశాలు ఎవరిచ్చారు..? ఇప్పుడు ఆ వస్తువులు ఎక్కడ ఉన్నాయి...? అనే ప్రశ్నలకు తక్షణమే సమాధానం ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. బాధ్యులపై విచారణ జరిపి, తగిన విధంగా శాఖ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.సింగరేణి కార్మికులే ఈ సంస్థకు వెన్నెముక. వారిపైనే ఇలా వ్యవహరించడం అసహనాన్ని రేపుతోంది. మేము సంస్థను ఆందోళనతో హెచ్చరించేందుకు సిద్ధం” అంటూ కొందరు కార్మికులు హెచ్చరిస్తున్నారు.

### నైతిక విధ్యలు పాటించాలి...

ఒకవేళ ఇది అధికారుల నిర్లక్ష్యం వల్ల జరిగిందా? లేక కావాలనే కార్మికుడిని చిన్నచూపు చూసి జరిగినదా? అనే కోణంలో సంస్థలో సమగ్ర విచారణ జరగాలి. బాధితుడికి నష్ట పరిహారం ఇవ్వడం తో పాటు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం అవసరం. ఈ ఘటనపై ప్రజలలోనూ, కార్మిక వర్గాలలోనూ తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. “సంక్షేమమే లక్ష్యమని చెప్పే సింగరేణికి, కార్మికుల బాధలు పట్టవా?” అని నోరు తెరిచే పరిస్థితి ఏర్పడింది. సంస్థ పట్ల నమ్మకం కోల్పోతున్న కార్మికుల విశ్వాసాన్ని నిలబెట్టాలంటే, తక్షణమే ఈ విషయంపై స్పష్టమైన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.





# మా భూములు ఎక్కడ

## పోలవరం ప్రాజెక్ట్ ముంపుకు గురైన దేవీపట్నం మండలం పరసానిపాడు:రావిలంక ప్రజల గోడు







**దేవి పట్నం మండలం (ఆకాంక్ష న్యూస్) ప్రతినిధి సారాను సూరిబాబు దొర ది10/06/2025 ప్రజా గర్జన న్యూస్ :** రైతులు సర్వం కోల్పోయి బ్రతుకు జీవుడా అంటూ, 2006 సంవత్సరం నుండి ఇప్పటివరకు 2025 సంవత్సరం వరకు దాదాపుగా 18 సంవత్సరాలు అయిన సరైన ఆర్ అండర్ ప్యాకేజీ లేదు, అంతకుమించి భూమికి బదులు భూమి ఇవ్వటంలో అధికారులు పక్షపాతం చూపిస్తున్నారు, దేవీపట్నం మండలం రెవెన్యూ అధికారులు మరియు %=ఢ=% అధికారులు, నిర్వాసితుల గోడు 18 సంవత్సరాలుగా, ఎవరు పట్టించుకోలేదు, 2007వ సంవత్సరం నుంచి భూమికి భూమి ఇచ్చిన రైతులు కూడా ఇప్పటికీ వారికి వ్యవసాయం చేయుటకు అనుకూలంగా లేనందున, అలాగే తోటి ట్రైబల్స్ వ్యవసాయ సాగులో ఉన్న భూములు కూడా అప్పగించి, సాగులో ఉన్న రైతులు తో మేము గొడవలు పడే స్థితిలో మేము కొన్ని భూములను వదిలేయవలసి వచ్చింది, అప్పటినుండి వేరేచోట భూమికి భూమి అప్పగిస్తామని అప్పటి అధికారులు కూడా చెప్పడం జరిగింది, అదే పందాలో కుంజం సత్యవతి %ఃl/శీ% చెల్లన్న దొర, అనే రైతుకు, సర్వే నెంబరు 5/1%ఖ% లో, 1.58సెంట్లు,భూమికి భూమి అప్పగించి, వెను వెంటనే వేరే ఒక రైతుకు అప్పగించడం జరిగింది, అలాగా 2019లో మరొకసారి వేరే భూమి అప్పగించి, మరలా వేరే రైతుకు తీసుకువచ్చి అదే భూమి అప్పగించి మాకు బయటకు తరిమేయడం జరిగిందని రైతు బాధను వ్యక్తం చేశారు. 2022సం.లో. (అప్పట్లో సర్వేయర్ ) ఇలా ఎందుకు జరుగుతుంది, నిర్వహిశిత రైతుకి భూమికి భూమి ఇవ్వాలి అని అంటే ముడుపుల చెల్లించాలా? అలాగే డి రావిలంక గ్రామాల రైతులు సంబంధించి నటువంటి, మడకం కృష్ణ దొర, జోడి రామన్న దొర, మడకం గంగన్న దొర, బొరగా శ్రీరాములు దొర, జోడే బాపన దొర, తుర్రం వీరపుదొర, జోడి సీతమ్మ, కొమరం పోచమ్మ, అలాగే మరికొందరు రైతులకు 18 సంవత్సరాల నుంచి దేవీపట్నం మండలంలోని అధికారులు ఆఫీసుల చుట్టూ ఆర్ అండ్ ఆర్ అధికారులతో అనేకమైన అర్జీలు పెట్టుకున్న భూమికి భూమి ఇవ్వలేదు.( 18 సంవత్సరాలుగా ఒక నిర్వాసితులైన తమ తమ భూములు తమకే అప్పగించడానికి అధికారులకు ఇంకా ఎంత టైం పడుతుంది.) ఇప్పటికైనా దేవిపట్నం రెవెన్యూ అధికారులు మరియు %=ఢ=% అధికారులు, స్పందించి రైతులందరికి, భూమికి భూమి అప్పగించాలని కోరుతా ఉన్నాము, నిర్వాసితుల అమాయకత్వాన్ని ఆసరగా తీసుకొని, వెంటనే భూమికి బదులు భూమి అప్పగించకపోయినట్లయితే, నిర్వాసిత రైతుల అందరం న్యాయపోరాటానికి,,, సిద్ధంగా ఉన్నామని “ప్రజా గర్జన పత్రిక”ముఖంగా తెలియజేస్తున్నాము.

# కొమ్మంగిలో జనసేన బలోపేతానికి పిలుపు

## గ్రామాభివృద్ధే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలను చైతన్యం చేసిన మండల అధ్యక్షుడు వంతల బుజ్జి బాబు

**అల్లూరి జిల్లా, చింతపల్లి (ఆకాంక్ష న్యూస్) ప్రతినిధి శ్రీను వాసరావు జూన్ 10 :-** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం కొమ్మంగి గ్రామ పంచాయతీ కేంద్రంలో గసరి దిలీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి జనసేన పార్టీ చింతపల్లి మండల అధ్యక్షుడు వంతల బుజ్జి బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేనను విజయపథంలో నడిపించేందుకు పార్టీ బలోపేతం, కార్యకర్తల ఐక్యతను మరింతగా పెంపొందించాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. ప్రత్యేకంగా మారుమూల గిరిజన ప్రాంతాల్లో పార్టీ కార్యక్రమాలను విస్తరించాలని సూచించారు. ప్రతి బడుగు, బలహీన వర్గ ప్రజలకు జనసేన పార్టీ అండగా ఉంటుంది. గ్రామాభివృద్ధి, ప్రజాప్రయోజనాలే మాకు ముఖ్య లక్ష్యాలు, అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో జరిగిన పరస్పర సంభాషణలో బుజ్జి బాబు, కొమ్మంగి గ్రామంలో త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తెలుసుకున్నారు. ప్రస్తుతం పైపులైన్ ద్వారా నుయ్యి నుంచి నీరు తరలించబడుతున్నా, సరైన సరఫరా జరగడం లేదు. సంబంధిత శాఖ అధికారులతో చర్చించి త్వరితగతిన సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాను, అని హామీ ఇచ్చారు. అనంతరం వైసీపీ పార్టీ వార్డు నంబర్ కార్యకర్త నాగెలి వెంకటరావు తన అనుయాయులతో కలిసి జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీ నిధులను వెనక్కి తీసుకుని, సర్పంచులను భిక్షాటనకు గురిచేసిన దుస్థితిని చూశాం. పవన్ కళ్యాణ్ నాయకత్వం, అభివృద్ధి కార్యక్రమాలను చూసి జనసేన సిద్ధాంతాల పట్ల నమ్మకంతో పార్టీలో చేరుతున్నాం, అన్నారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ మండల కోఆర్డినేటర్ వంతల రాజుబాబు, సీనియర్ నాయకులు కారేగి మచ్చెరాజు, పాంగి సుబ్బారావు, కొర్ర బాలాజీ, పాంగి కృష్ణ, గుంట చంటి, గుంట కోటి, సిందేరి సురేష్ తదితరులు పాల్గొన్నారు. స్థానికంగా గ్రామస్తులు మద్దెల కోటేశ్వరరావు, లక్కే ఈశ్వరరావు, నూకరాజు, కవిత, కాంతమ్మ, చిన్నమ్మి, విరమ్మ, రామ్, సాయి కుమార్, రాజా, సతీష్, కోటి బాబు తదితరులు హాజరయ్యారు.



# కొయ్యూరు మండల ఎంపీడీవో ప్రసాద్ ని మర్యాదపూర్వకంగా కలిసిన తెలుగుదేశం పార్టీ మండల కార్యదర్శి తోట దొరబాబు




**(ఆకాంక్ష న్యూస్) జూన్ 11( కొయ్యూరు రిపోర్టర్ రమేష్)** అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం కొయ్యూరు ఎంపీడీవో గా నూతనంగా జాయిన్ అయినా ప్రసాద్ ని కొయ్యూరు మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. దొరబాబుతో పాటు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మేడిపోయిన సత్తిబాబు యూనిట్ ఇంచార్జి కూనిశెట్టి చంద్రరావు. జీలకర్ర శ్రీను తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బుదరాళ్ల పండు. బూత్ ఇంచార్జి వజ్రపు వెంకటరమణ.పాల్గొన్నారు

# సంకుస్థాపన చేసారు తవ్వివదిలేచారు



**(ఆకాంక్ష న్యూస్) న్యూస్ ది 10/06/2025 :** మారేడుమిల్లి నుండి వై రామవరం మండలం చింతలపూడి రోడ్డు పనులు మొదలు పెట్టాలని ప్రజా లు కోరుతున్నారు సంకుస్థాపన చేసిన వారంరోజులు ఆర్భాటంగా ప్రొక్లియన్ వచ్చి రోడ్డు తవ్వటం మొదలు పెట్టటం జరిగింది ఎదోఒకలా బాగున్నా రోడ్డు కొత్త రోడ్డు సేంక్షన్ అయ్యింది అని తవ్వి ప్రజలకు ఇబ్బంది కారంగా మార్చారని ద్విచక్ర వాహనాలతో అత్యవసర పరిస్థితుల్లో ప్రయణాలుచేస్తున్నవారు తవ్వివదిలేయటంవలనలేసిపోయిఉన్న మెటల్ వలన బేలన్స్ కాసుకోలేక పడిపోవడం జరుగుతుందని ఈ రోడ్డు ఎప్పుడు చేస్తారో తెలియదు కానీ మనుషులం మాత్రం ఆసుపత్రిపాలు అవుతున్నామని వెనకటికి వర్షం నీళ్ళకు ఆశపడి ఇంటిలోని నీళ్ళు పారేసుకున్న ట్టు ఉందని నిజంగా ఈ రోడ్డు పనులు పూర్తిచేస్తే రెండు మండలాలకు చెందిన ప్రజలకు ఊరటగాఉంటుందని అధికారులు ఒకసారి ఆలోచన చేసి రోడ్డు పనులు మొదలుపెట్టాలని వేటూకూరు పంచాయితీ బి మవరంగ్రామం పెసాకార్యధర్శి ఈతపల్లి సత్యనారాయణ రెడ్డి ప్రతీక ద్వారా అధికారులకు తెలియజేయటం జరిగింది

# శిధిలవస్థకు చేరుకున్న వాలాసి ఆరోగ్య సబ్ సెంటర్

## స్పందించని అధికారులు ప్రజాప్రతినిధులు



**(ఆకాంక్ష న్యూస్) (మధు సుధన్)జూన్ 10:** అనంతగిరి మండలం వాలాసి పంచాయతీ పరిధిలోగల ఆరోగ్య కేంద్రం (సబ్ సెంటర్) శిధిలావస్థకు చేరింది, ఈ ఆరోగ్య కేంద్రం సుమారు 25 సంవత్సరాల ముందు కట్టారు. ఈ ఆరోగ్య కేంద్రాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఇన్నిసంవత్సరాలు కావచ్చిన ఏ అధికారి కూడా ఈ కేంద్రాన్ని స్పందించకుండా ఉండిపోయారు, ఈ శిధిలావస్థ చేరుకున్న భవనం ఏదో ఒక రోజు ప్రాణ నష్టం జరిగితే తప్ప అధికారులకు స్పందన లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య కేంద్రం లోపల వెళ్లాలంటే ఆ భవనాన్ని చూస్తే ఏ సమయంలో ఏం జరుగుతుందోనని భయపడి లోపలికి వెళ్ళటం లేదు,అయితే భవనానికి సరియైన తలుపులు గాని కిటికీలు గాని లేవు భవనానికి సన్ సైడ్ ఏ సమయంలో కిందకి పడిపోతుందో అని భయంతోనే ప్రజలు బిక్కు బిక్కున్న చూసుకుంటూ వైద్యానికి వెళు _న్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఈ భవనానికి నిధులు మంజూరు చేసి కొత్త భవనం ఏర్పాటు చేయగలరని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు

# గిరిజన ఆరాధ్యుడైన పాకలపాటి గురువు జయంతి వేడుకలు ఘనంగా



**అల్లూరి జిల్లా, చింతపల్లి (ఆకాంక్ష న్యూస్) పతినిధి (శ్రీనువాసరావు) జూన్ 10 :-** గిరిజనుల ఆరాధ్యాదైవంగా భావించే, శ్రీ శ్రీ శ్రీ ధామరాజు వేంకటరామ యోగేశ్వరుల (పాకలపాటి గురువు) జన్మదినం రేపు (బుధవారం) జరగనుంది. ఈ సందర్భంగా, జ్యాష్ట పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని, చింతపల్లి మండలంలోని లోతుగెడ్డ జంక్షన్ సమీపంలోని కృష్ణాపురం గ్రామంలో ఉన్న బాబు ఆశ్రమంలో పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నాయి. గురుభక్తులు, గురుబంధువులు ఈ పూజలో పాల్గొని, గురుదేవుల తీర్థ ప్రసాదాలను స్వీకరించేందుకు ఆహ్వానించబడుతున్నారు. ఈ వేడుకలు యావన్నీకి ఓ దైవిక అనుగ్రహాన్ని ప్రసాదించేవిగా ఉంటాయని, గురుదేవుల సమర్పణతో అనుగ్రహాలు పొందగలుగుతామని ప్రార్థన చేస్తున్నారు. ఈ వేడుకలకు సంబంధించి రామానంద యతీశ్వరులు మరియు గురుభక్తులు పిలుపునిచ్చారు. గురుదేవుల ఆశీస్సులతో ఈ కార్యక్రమం సజావుగా జరుగుతుందని వారు తెలియజేశారు.

# కించమండ ఎస్ బి ఐ బ్యాంక్ ఎదురుగా ప్లాస్టిక్ వ్యర్థాలు



**అల్లూరి జిల్లా అరకు నియోజకవర్గ / (ఆకాంక్ష న్యూస్) (న్యూస్ రిపోర్టర్ డిప్పల మల్లేశ్వరరావు) జూన్ 10 :** అల్లూరి జిల్లా డుంబ్రిగూడ మండలం కించుమండ పంచాయతీ కించమండ గ్రామం,పరిధిలో గల హైవే లైన్ ప్రక్కన ఉన్నటువంటి ఎస్ బి ఐ బ్యాంకు ఎదురుగా వ్యర్థాలు ప్లాస్టిక్ సామాన్లు ప్లాస్టిక్ వాసనకు సంబంధించిన వ్యర్థాలు మరియు అదేవిధంగా ఎస్ బి ఐ బ్యాంక్ ఎదురుగా మురికి నీరు నిలవ వలన బ్యాంక్ కి వస్తున్నటువంటి ప్రజలు ఇబ్బందికి గురవుతున్నారు గనుక పంచాయతీ శాఖ వారు గుర్తించి వెంటనే వాటిని నుండి వ్యర్థాలు తొలగించాలని కోరడమైనది.